
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
కృష్ణా జిల్లా వార్తలు
ఆదివారం 27 అక్టోబరు 2024





పడవల ద్వారా తీసుకొచ్చిన ఇసుకను ట్రాక్టర్లో ఎత్తుతున్న కూలీలు

ఇసుక మాఫియా బరితెగింపు

పాపవినాశనంలో ఇసుక దందా

- పడవల్లో ఇసుక తెచ్చి ట్రాక్టర్లలో తరలింపు
- అటువైపు కన్నెత్తి చూడని రెవెన్యూ, పోలీస్ అధికారులు
- ప్రశ్నించిన స్థానికులు, మీడియాపై ఎదురుదాడి

ఘంటసాల మండలం పాపవినాశనంలో ఇసుక మాఫియా బరితెగించింది. ప్రవహిస్తున్న నదిలో నుంచి పడవలతో ఇసుక ఒడ్డుకు తెప్పిస్తోంది. ట్రాక్టర్లలో యథేచ్ఛగా తరలించి సొమ్ము చేసుకుంటోంది. ఇదేంటని ప్రశ్నించిన స్థానికులు, మీడియా వారిపై ఎదురుదాడికి దిగుతోంది. దురుసుగా వ్యవహరించి భయ భ్రాంతులకు గురిచేస్తోంది. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఘంటసాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల మండలం పాపవినాశనం ఇసుక క్వారీ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. కృష్ణానదిలో వరద నీరు ప్రవహిస్తుండటంతో పడవల సహాయంతో ఇసుక తరలింపునకు ఇసుక మాఫియా శ్రీకారం చుట్టింది. ఐదు పడవల్లో 15 మంది వ్యక్తులు ఇసుకను తెచ్చి ట్రాక్టర్లలో లోడ్ చేస్తున్నారు. ఒక్కొక్క ట్రాక్టర్‌కు సుమారు రూ.2500 తీసుకుంటున్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ప్రశ్నించగా, వారిపై కూడా మాటల దాడికి ఈ మాఫియా దిగి.. మాకు అనుమతులు ఉన్నాయి.. ఎవరు ఆపుతారో చూస్తామని రెచ్చిపోయింది. పాపవినాశనం ఇసుక క్వారీ నుంచి శనివారం తెల్లవారుజామున 5.30 గంటల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుంటే రెవెన్యూ, పోలీస్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు. క్వారీలోకి బహిరంగంగా వాహనాలు వస్తూ ఇసుకను తరలించుకుపోతున్నా పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మీడియాపైనా దురుసు ప్రవర్తన :

పాపవినాశనం క్వారీలో అక్రమంగా ఇసుక లోడింగ్ చేస్తున్న విషయం తెలుసుకున్న స్థానిక పాత్రికేయులు అక్కడికెళ్లి ఫొటోలు తీస్తుండగా.. ఎందుకు ఫొటోలు తీస్తున్నారని ట్రాక్టర్ డ్రైవర్లు ప్రశ్నించారు. మాకు అనుమతులు ఉన్నాయని మీడియా ప్రతినిధులపై వాదనకు దిగి దురుసుగా ప్రవర్తించారు. ఈ నేపథ్యంలో ఇసుక తరలింపు విషయం సోషల్ మీడియాలో రావడంతో రెవెన్యూ యంత్రాంగంలో కదలిక వచ్చింది. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో తహసీల్దార్ విజయ ప్రసాద్ సిబ్బందితో కలసి పాపవినాశనం క్వారీని పరిశీలించారు.



పాపవినాశనం క్వారీ వద్ద క్యూ లైన్‌లో ఇసుక ట్రాక్టర్లు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: తహసీల్దార్

కృష్ణానదికి వరద నీరు తగ్గిన తర్వాత ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తాం. పడవల్లో ఇసుక తెచ్చి ట్రాక్టర్లలో తరలింపు చట్టవిరుద్ధం. నదిలోకి వెళ్లటానికి ఎవరికి అనుమతులు లేవు. పాపవినాశనం క్వారీలో అక్రమ ఇసుక తరలింపు విషయం నా దృష్టికి వచ్చింది. అక్కడకెళ్లి వాహనదారులను హెచ్చరించి బయటకు పంపించేశాం. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

బాణసంచా నిల్వకు అనుమతి తప్పనిసరి

- కృష్ణా ఎస్పీ ఆర్.గంగాధరరావు

6లో

అదిగదిగో నవ లోకం



సూర్యాస్తమయం వేళ నవలంక

అబ్బుర పరుస్తున్న ఇసుక తిన్నెలు

- కనువిందు చేస్తున్న గడ్డి పూలు
- ఆకట్టుకుంటున్న సముద్రపు జీవుల ఆనవాళ్లు
- సుమనోహరంగా ప్రసరిస్తున్న సూర్యకిరణాలు

నిన్న మొన్నటి వరకు సూర్యాస్తమం వేళ మనోహర దృశ్యాలతో పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునే నాగాయలంక శ్రీరామపాదక్షేత్రం సమీపంలోని నవలంక దీవి నేడు వరదల అనంతరం విరించి ప్రత్యేక శ్రద్ధపెట్టి తీర్చిదిద్దాడా అన్నట్లు కృష్ణమ్మ గర్భం నుంచి సరికొత్త అందాలతో పునరుద్భవించింది. అబ్బురపరుస్తున్న ఇసుక తిన్నెలు, గడ్డి పూల అందాలు, సముద్ర జీవుల అడుగు జాడలు ప్రకృతి ప్రేమికుల మనసు దోచుకుంటున్నాయి. నీటిపై బంగారు వర్ణాన్ని అద్దుతున్నట్లు ప్రసరించే సూర్యకిరణాలు పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. ప్రకృతి రమణీయ దృశ్యాలతో తులతూగే నవలంక మరో భవానీ ద్వీపాన్ని తలపిస్తోంది. పర్యాటకులను విశేషంగా ఆకరిస్తోంది. ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న నవలంకపై ప్రత్యేక కథనం.

8

మద్యం.. అభ్యంతరం

మద్యం షాపుల ఏర్పాటు ప్రదేశాలపై ఫిర్యాదులు



చల్లపల్లి మండలం రామానగరంలో ఇళ్ల మధ్య మద్యం దుకాణాన్ని వ్యతిరేకిస్తున్న మహిళలు

మద్యం షాపులు ఏర్పాటు చేయనున్న ప్రదేశాలపై ప్రజల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. చల్లపల్లి మండలం రామానగరం వరల కంపెనీ, డోకిపర్రులో వేంకటేశ్వరస్వామి గుడికి సమీపంలో, ముస్తాబాద ఫ్లైవోవర్ వద్ద మద్యం దుకాణాలు పెట్టవద్దని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆయా ప్రదేశాల్లో మహిళలు, విద్యార్థినులు, భక్తులు ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటు గొడవలు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- జేసీని కలిసి వినతి పత్రం ఇచ్చిన రామానగరం మహిళలు
- డోకిపర్రు, ముస్తాబాదలోనూ స్థలం మార్చాలని విజ్ఞప్తి
- గొడవలు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో నూతన మద్యం షాపుల ఏర్పాటు అంశం చిలికి చిలికి గాలీవానగా మారుతోంది. గృహాల మధ్య షాపులు పెడుతున్నారని, తాగిన మైకంలో గొడవలు చేసే అవకాశం ఉందని, వేరేచోట ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు. చల్లపల్లి మండలం రామానగరం వరల కంపెనీ వద్ద గృహాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేస్తున్నారు. ఇది వివిధ ప్రాంతాలకు వెళ్లే కూడలి కావడంతో మహిళలు, విద్యార్థినులు ప్రయాణాల నిమిత్తం బస్సులు, వ్యాన్లు, ఆటోల కోసం ఇక్కడ ఎదురుచూస్తూ ఉంటారని, ఇటువంటి ప్రదేశంలో మద్యం షాపు వద్దని పలువురు మహిళలు కలెక్టరేట్‌కు వచ్చి జేసీకి ఫిర్యాదు చేశారు. స్థానిక అధికారులకు ఇక్కడ మద్యం దుకాణం వద్దని వినతిపత్రం ఇచ్చామని, వారు ఈ ప్రాంతాన్ని పరిశీలించి శ్మశానానికి సంబంధించిన స్థలంలో మద్యం షాపు ఏర్పాటు చేయకూడదని కూడా చెప్పారని మహిళలు అర్జీలో పేర్కొన్నారు. మద్యం దుకాణం ఏర్పాటు వల్ల గొడవలు జరుగుతాయని, విద్యార్థినులు రాత్రిపూట ట్యూషన్‌కు వెళ్లి రావడం ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు. మద్యం షాపు ఏర్పాటుపై అభ్యంతరం చెప్పిన నేపథ్యంలో షాపు నిర్వాహకులు కొందరు స్థానికులను రెచ్చగొట్టి గొడవలు సృష్టించారని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వేరే ప్రాంతంలో మద్యం దుకాణాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. మళ్లీ వరల కంపెనీ వద్దనే మద్యందుకాణం ఏర్పాటు చేస్తారనే ప్రచారం విస్తృతంగా జరుగుతుండటంతో స్థానికులు ఆందోళనలు చేస్తూనే ఉన్నారు.

గుడికి వచ్చే భక్తులకు ఇబ్బందే..

గుడ్లవల్లేరు మండలం డోకిపర్రులో వెంకటేశ్వరస్వామి గుడికి సమీపంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాన్ని నడిపారు. గతంలో ఈ మద్యం దుకాణం కారణంగా గుడికి వచ్చే భక్తులు, స్థానికులు ఇబ్బందుల పాలయ్యారు. మళ్లీ అక్కడే ప్రైవేటు మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. దీంతో స్థానికులు మద్యం దుకాణాన్ని గుడికి దూరంగా ఏర్పాటు చేయించాలని అధికారులకు వినతిపత్రం అందజేశారు. గతంలో ప్రభుత్వ మద్యం దుకాణం నడిపినచోట మళ్లీ మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే మీకు ఇబ్బంది ఏమిటని ప్రశ్నిస్తూ అక్కడే మద్యం దుకాణం పెట్టే ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి.



ప్రయాణికులతో గొడవలు

గన్నవరం మండలం ముస్తాబాద ఫ్లై ఓవర్‌కు దిగువ ప్రాంతంలో మద్యం దుకాణం త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు బోర్డు పెట్టారు. గతంలో ఈ ప్రాంతంలో ప్రభుత్వ మద్యం దుకాణం నడిపేవారు. ఇక్కడ మద్యం మత్తులో మందుబాబులు దారినపోయే వారితో గొడవలకు దిగి వీరంగం సృష్టించేవారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఇక్కడ మద్య దుకాణం ఏర్పాటుకు అనుమతులు ఇవ్వవద్దని స్థానికులు కృష్ణా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గంగాధరరావు దృష్టికి తీసుకువెళితే షాపు ఏర్పాటు చేయకుండానే మీకెందుకు తొందర అంటూ ఆయన ఎదురు ప్రశ్నిస్తుండటం గమనార్హం.

షాపులకు దరఖాస్తులు తీసుకునే సమయంలోనే వసూళ్లు ?

జిల్లాలోని 123 మద్యం దుకాణాలకు 2,942 దరఖాస్తులు వచ్చాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో మద్యం దుకాణాల కోసం దరఖాస్తులను సమర్పించారు. దరఖాస్తులకు సంబంధించిన వివరాలు నమోదు చేసే సమయంలో కొన్ని ఎక్సైజ్ స్టేషన్‌లలో ఒక్కో దరఖాస్తుకు రూ.5 వేల చొప్పున వసూలు చేశారని దరఖాస్తులు సమర్పించిన వారు చెప్పకనే చెబుతున్నారు. మద్యం దరఖాస్తులకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా మేం చూసుకుంటామని చెప్పి ఈ నగదు వసూలు చేశారని దరఖాస్తుదారులు చెబుతున్నారు.

అయితే ఎక్సైజ్ అధికారులు ఇక్కడో నీతిని పాటించారు. ఒక దరఖాస్తుదారుడు ఒకటికి మించి షాపులకు దరఖాస్తు చేసుకుంటే, ఒక దరఖాస్తునకు మాత్రమే నగదు తీసుకుని మిగిలిన వాటికి మినహాయింపు ఇచ్చారని మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసిన సిండికేట్ లీడర్లు చెప్పడం గమనార్హం. ఈ నెలాఖరుకు మద్యం దుకాణాలకు పూర్తిస్థాయి లైసెన్సులు మంజూరు చేస్తారని, అప్పటికి ఎక్సైజ్ అధికారులు ఎలాంటి ఇండెంట్‌లు పెడతారోనని మద్యం షాపులు దక్కించుకున్న వారు హైరానా పడుతున్నారు.

దుర్గమ్మకు పుస్తక నీరాజనం

- కనకదుర్గ వైభవాన్ని అక్షరబద్ధం చేసిన దుర్గగుడి ఈవో రామారావు

6లో

కృష్ణాను ప్రథమ స్థానంలో నిలుపుదాం

- నూతన డీఈవో పీవీజే రామారావు

6లో

భారీగా బాణసంచా

శివకాశి నుంచి దిగుమతైన సరుకు

దీపావళి సందడి మొదలైంది. రెండు నెలల కిందటే శివకాశి నుంచి భారీగా సరుకు దిగుమతి కాగా, గోడౌన్లలో ఉన్న బాణసంచాను వ్యాపారులు బయటకు తీస్తున్నారు. ప్రస్తుతం భారీ ట్రేడర్ల నుంచి హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు కొనుగోలు చేస్తుండగా, నగరంతో పాటు జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో స్టాళ్ల ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి.



గన్నవరంలో ఏర్పాటు చేస్తున్న దుకాణాలు

విజయవాడ శివారుల్లోని గోడౌన్లలో నిల్వ

- ట్రేడర్ల నుంచి హోల్‌సేల్, రిటైల్ వ్యాపారుల కొనుగోళ్లు
- 16 మండల కేంద్రాల్లో ప్రైవేట్ స్టాళ్ల ఏర్పాటుకు అనుమతి
- విజయవాడలోని నాలుగు అర్బన్ మండలాల పరిధిలోనూ..
- మొదలైన దీపావళి హంగామా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : దీపావళి సమీపిస్తుండటంతో జిల్లావ్యాప్తంగా బాణసంచా పెద్ద ఎత్తున దిగుమతైంది. హోల్‌సేల్, రిటైల్‌గా అమ్మకాలు సాగించటానికి వీలుగా వ్యాపారులు సరుకును సిద్ధం చేసుకుంటున్నారు.

మొదలైన కోలాహలం

జిల్లావ్యాప్తంగా 235కు పైగా లైసెన్స్‌డ్ బాణసంచా వ్యాపారులున్నారు. వీరంతా రెండు నెలల కిందటే శివకాశి నుంచి పెద్ద ఎత్తున సరుకు దిగుమతి చేసుకున్నారు. లైసెన్స్‌డ్ వ్యాపారుల్లో కూడా బడా ట్రేడర్లు, మధ్య చిన్న వ్యాపారులున్నారు. వీరంతా కూడా ఈ దీపావళి వ్యాపారంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. నెల రోజులుగా వాతావరణం బాగోకపోవటం, పండుగ ముందు తుఫాను హెచ్చరికలు రావటంతో నిన్న మొన్నటి వరకు వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. దానా తుఫాను పక్కకు తప్పుకోవడంతో వ్యాపారులు ఊపిరి పీల్చుకున్నారు. నగరంలోని బడా ట్రేడర్లు ఇప్పటికే సరుకును గోడౌన్లలో సిద్ధం చేసుకున్నారు. ఒక్కొక్కరూ పదికి తగ్గకుండా గోడౌన్లలో నిల్వ చేశారు. వీటిలో 80 శాతం పైగా సరుకును ఇతర బాణసంచా వ్యాపారులకు విక్రయిస్తున్నారు. మిగిలిన 20 శాతం విక్రయించటానికి సిద్ధమవుతున్నారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే స్టాళ్ల నిర్వాహకులు బాణసంచాను పెద్ద ఎత్తున ట్రేడర్ల నుంచి కొన్నారు. గొల్లపూడి, మైలవరం, తిరువూరు, గన్నవరం మండలాల పరిధిలో ఈ సరుకు సిద్ధంగా ఉంది. ఇక్కడి నుంచి హోల్‌సేల్‌గా ఇతర వ్యాపారులు కొంటున్నారు. రెవెన్యూ, పోలీసుల అనుమతితో శివారు ప్రాంతాల్లో ఏర్పాటుచేసే స్టాళ్లను పాడుకునే వారు కూడా పెద్ద ఎత్తున ట్రేడర్స్ నుంచి సరుకును దిగుమతి చేసుకుంటున్నారు.

బాణసంచా స్టాళ్లు ప్రారంభం

జిల్లావ్యాప్తంగా మండల కేంద్రాల్లో బాణసంచా స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖల అనుమతులతో కొంతమంది రిటైల్ వ్యాపారులు దుకాణాలకు అనుమతులు తీసుకుని, వాటికి వేలం నిర్వహించి వ్యాపారులకు కేటాయిస్తున్నారు. ఒక్కో స్టాల్ ఖరీదు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉంది. నలుగురైదుగురు వ్యాపారులు కలిసి ఓ స్టాల్‌ను నిర్వహిస్తున్నారు. వ్యాపారం పూర్తయ్యాక వీరంతా లాభాలను పంచుకుంటారు.

జిల్లావ్యాప్తంగా 16 మండల కేంద్రాల్లో స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. అమ్మకాలకు తేదీని ప్రకటించగానే, ఒకరోజు ముందే సరుకును సిద్ధం చేసుకుంటారు. నగరంలోని నాలుగు అర్బన్ మండలాల పరిధిలో కూడా పెద్ద ఎత్తున స్టాళ్ల నిర్వహణకు అనుమతులు లభించాయి.

గొల్లపూడి హోల్‌సేల్ మార్కెట్‌లో విక్రయాలు ప్రారంభం

గొల్లపూడి హోల్‌సేల్ మార్కెట్‌లో బాణసంచా విక్రయాలు ప్రారంభమయ్యాయి. ఇక్కడి హోల్‌సేల్ లైసెన్స్‌డ్ వ్యాపారులు పెద్ద ఎత్తున సరుకు దిగుమతి చేసుకున్నారు. వీరి నుంచి ప్రైవేట్ లైసెన్స్‌డ్ వ్యాపారులు కూడా కొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యం..

గుండెపోటుతో వ్యక్తి మృతి



ఆది పవన్ కుమార్ మృతదేహం

- సకాలంలో వైద్యం అందించని జీజీహెచ్ వైద్యులు

ప్రభుత్వాసుపత్రి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కొత్త ప్రభుత్వాసుపత్రి వైద్యుల నిర్లక్ష్యానికి ఓ నిండుప్రాణం బలైంది. సకాలంలో సేవలందించాల్సిన వైద్యులు సరిగ్గా పట్టించుకోకపోవడంతో ఓ కుటుంబం దిక్కులేనిదైంది. ఈ ఘటన శనివారం కొత్త ప్రభుత్వాసుపత్రిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. పామర్రు మండలం జుజ్జవరం గ్రామానికి చెందిన గార్లపాటి ఆది పవన్‌కుమార్ (35) తాపీపని చేస్తుంటాడు. శుక్రవారం గ్రామంలో పనిలో నిమగ్నమైన అతనికి ఒక్కసారిగా గుండెపోటు వచ్చింది. దీంతో హుటాహుటిన మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం శనివారం తెల్లవారుజామున విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. తెల్లవారుజామున 4.30 గంటలకు జీజీహెచ్‌కు తీసుకురాగా, 5 గంటల వరకు వైద్యులు స్పందించలేదు. గుండెపోటుతో ఉన్న వ్యక్తికి ఎమర్జెన్సీలో వార్డులో కాకుండా జనరల్ వార్డులో చికిత్స చేశారని, అదేమని ప్రశ్నిస్తే ఐసీయు ఖాళీ లేదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని, ఫలితంగానే పవన్ చనిపోయాడని ఆరోపిస్తూ బంధువులు ఆందోళన చేశారు. ఆసుపత్రిలో బీపీ, ఆక్సిజన్ మిషన్లు కూడా పనిచేయడం లేదని వారు మండిపడ్డారు.



ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్‌జీ కమెండోలు


సాయుధం.. ఆయుధం

- ఏఆర్ గ్రౌండ్స్‌లో పోలీస్ ఓపెన్ హౌస్‌కు విశేష స్పందన
- ప్రదర్శనలో పోలీసు ఆయుధ సంపత్తి

8లో

జగన్మాత కనకదుర్గమ్మ ప్రాశస్త్యాన్ని భక్తులకు మరింత చేరువ చేసేందుకు, అమ్మవారి ప్రాభవాన్ని వివరించే పలు పుస్తకాలను దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ముద్రిస్తోంది. ఈవో కేఎస్ రామారావు పుస్తకాల ముద్రణకు చొరవ తీసుకున్నారు. పుస్తకాలను ప్రచురించడమే కాకుండా, తానే సంకలనకర్తగా వ్యవహరిస్తున్నారు. అమ్మవారి వైభవం పట్ల పూర్తి అవగాహన ఉన్న ఆయన, పండితులతో చర్చించి పలు పుస్తకాలను వెలువరించారు. ఇవీ పుస్తక విశేషాలు..

- (ఆంధ్రజ్యోతి-వన్‌టౌన్)



అమ్మవారి ప్రాభవాన్ని చాటిచెప్పే పుస్తకాలను చూపుతున్న ఈవో రామారావు, సృష్టి లక్ష్మీ సీతారామాంజనేయశర్మ

దుర్గమ్మకు పుస్తక నీరాజనం

కనకదుర్గ వైభవాన్ని అక్షరబద్ధం చేసిన దుర్గగుడి ఈవో రామారావు

కనకదుర్గా వైభవం

దుర్గమ్మ ప్రాభవాన్ని వివరిస్తూ రూపొందించిన పుస్తకమే కనకదుర్గా వైభవం. కనకదుర్గ ఉపాసనాపరమైన విషయాలను భక్తులకు అందించాలన్న తపనతో ఈవో కేఎస్ రామారావు ఈ పుస్తకాన్ని రూపొందించారు. సృష్టి లక్ష్మీ సీతారామంజనేయశర్మ పరిశోధన చేసి వెలిబుచ్చిన అనేక విషయాలను పొందుపరుస్తూ కనకదుర్గావైభవం పుస్తకాన్ని తీసుకొచ్చారు. ఈ పుస్తకంపై శృంగేరీ పీఠాధిపతి భారతీతీర్థ స్వామి, ఉత్తర పీఠాధిపతి విదుశేఖర భారతీ, విద్యానారాయణతీర్థులు, స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సర స్వతి తమ శ్రీముఖాలను అందించారు. ఈ గ్రంథ రచనలో కోడూరు వెం కట గోపాలకృష్ణశర్మ, హేమ దంపతులు, టి.లక్ష్మీనాగపద్మావతి, లక్ష్మీమాధురి, వేదాంత విశారద సృష్టి లక్ష్మీ ప్రసన్నాంజనేయశర్మ, సృష్టి లక్ష్మీనరసింహం, సృష్టి లక్ష్మీధరశర్మ, ఆవంచ శారదావరప్రసాద్ దంపతులు, మంతెన భారతి, మంతెన యోగేంద్ర కుమారవర్మ, దేవస్థానం వేద పండితులు విరూపాక్షం శ్యావాస్య మహర్షి, శంకర శాండిల్య శర్మ తదితరులతో పాటు కనకదుర్గ ప్రభ సంపాదకుడు గంగాధర్, సైదా, తదితరులు గ్రంథ రచనలో తమ సహకారాలను అందించారు. ఇందులో కనకదుర్గాదేవికి సంబంధించిన అనేక స్తోత్రాలు, అష్టోత్తరాలు, శ్లోకాలు, దుర్గాసప్తశ్లోకి, ఇంకా అనేకమైన ఉపాసనా విధానానికి సంబంధించిన విశేషాలను రాసుకొచ్చారు. మహిషాసురమర్దినిగా అవతరించి దుర్గా రూపంలో భక్తులను కాపాడుతున్న దుర్గమ్మ గురించి ఈ పుస్తకంలో అనేకానేక అంశాలు ఉన్నాయి. శరన్నవరాత్రుల్లో అమ్మవారి అలంకారాలను ఇందులో స్పష్టంగా వివరించారు.

అపౌరుషేయమ్

అపౌరుషేయమ్ పేరిట సంస్కృతంలో శ్రీమహాభాగవతాన్ని రాశారు. దీనిని తెలుగులో నేషనల్ కల్చరల్ రీసెర్చ్ శిక్షణ కేంద్రం(ఎన్‌సీఆర్టీ) అనువదించింది. అమ్మవారి అనుగ్రహ చరిత్ర, అమ్మవారిని ఆరాధించే విధివిధానాలతో పాటు మొత్తం 81 అధ్యాయాలతో విశేష గ్రంథంగా ఇది భక్తులకు అపారమైన భక్తి సంపదను అందిస్తోంది. సతీవివాహ వర్ణన, నందికి ప్రథమాధిపత్యం ఇవ్వడం, దక్షయజ్ఞ విశేషాలు, దక్షయజ్ఞ ధ్వంస వర్ణన, కామరూపాది వర్ణన, గంగాదేవి ఆగమనం, గంగా వివాహం ఇలా అనేక అంశాలను ఇందులో జోడించారు.

శ్రీదుర్గా సౌందర్యలహరి

శ్రీదుర్గా సౌందర్యలహరిని మహా శతావధాని డాక్టర్ మాడుగుల నాగఫణి శర్మ గానం చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1 వరకు తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నాగఫణిశర్మ గానం చేసిన సౌందర్యలహరిని దుర్గగుడి అధికారులు పుస్తకరూపంలో తీసుకొచ్చారు. దుర్గమ్మను తలచిన భక్తులు ఎవరూ దుర్గతుల పాలు కారంటూ ఆపదలో ఉన్నవారు అమ్మవారిని స్తుతిస్తే తక్షణమే ఆమె ఆపదలను తీరుస్తుందని పేర్కొంటూ ఈ శ్రీదుర్గా సౌందర్యలహరి పుస్తకం రూపొందింది.

సౌభాగ్యమస్తు..

సౌభాగ్యమస్తు పేరిట ఒక పుస్తకాన్ని తీసుకొచ్చారు. ప్రముఖ పండితుడు కన్నడ, ఆంధ్ర అవధాని అనంతపురానికి చెందిన జోస్యుల సదానంద శాస్త్రి ముందు మాట రాసిన ఈ పుస్తకంలో వివాహ వ్యవస్థను గురించి, దానిలో ఉండే అనేక ప్రక్రియల విశేషాలను వివరించారు. దుర్గగుడిలో అమ్మదర్శనం చేసుకున్న నూతన దంపతులకు అమ్మవారి పసుపు, కుంకుమలతోపాటు ఈ పుస్తకాన్ని ప్రసాదంగా అందిస్తున్నారు. వివాహ సమయంలో పురోహితులు చదివే మంత్రాలు, వివాహతంతులోని అర్థాన్ని అందరూ అర్థం చేసుకునేందుకు వీలుగా దీనిని రూపొందించారు. ఈవో రామారావు ఆలోచనలను సదానంద శాస్త్రి అక్షర రూపంలోకి తీసుకొచ్చారు. ఈ పుస్తకంలో వధూవరుల పెళ్లిచూపుల నుంచి కన్యావరణం, నిశ్చితార్థం, స్నాతకం, వివిధ హోమాలు, ఏడడుగులు వేయడం, అరుంధతిని చూపించటం, వాటి వెనుక ఉన్న పరమార్థాన్ని ఇందులో వివరించారు.

ఆలయ విజ్ఞానం

ఆలయ విజ్ఞానం పేరిట డాక్టర్ కప్పగంతు రామకృష్ణ రాసిన పుస్తకాన్ని ఈ ఏడాదే ప్రథమ ముద్రణ చేశారు. దీనికి దేవస్థానం ప్రచురణ బాధ్యతలు నిర్వహించింది. ఆలయాలకు వెళ్లేటప్పుడు ఏం చేయాలి, భక్తులు ఎలా ఆలయానికి వెళ్లాలి..ఎందుకు వెళ్లాలి, ఆలయాల వైభవం ఏమిటి? ఆలయాల్లో వినియోగించే వివిధ వాహనాలు, వాటి విశేషాలు, ఆలయంలో ఉండే బలిపీఠం విశిష్టత, ఆలయ ప్రాంగణంలో ఉండే అనేకానేక విశేషాలను ఇందులో వివరించారు. ఆలయ ధ్వజస్తంభం, ముఖద్వారం, అంతరాలయం, ద్వారపాలకులు, గోపురాలు వంటి ఎన్నో విశేషాలు ఈ పుస్తకంలో ఉన్నాయి.

శ్రీదుర్గాభవానీ సంకీర్తన నామావళి

దుర్గానామ సంకీర్తన పరిశోధకుడు డాక్టర్ సృష్టి లక్ష్మీ సీతారామాంజనేయ శర్మ రూపొందించిన దుర్గాభవానీ సంకీర్త నామావళిని పుస్తక రూపంలో తీసుకొచ్చారు. గరికపాటి వెంకట ప్రభాకర్ స్వరకల్పన, గానం అందించారు. ప్రధాన సంపాదకుడిగా కేఎస్ రామారావు వ్యవహరించారు. 41 రోజుల పాటు భవానీదీక్షలు తీసుకునేవారు, భక్తుల అమ్మవారి కృపకు పాత్రులయ్యేందుకు జయదుర్గా జయజయ దుర్గా, జయభవానీ, జయజయ భవానీ అంటూ మొదలైన 41 నామావళిలను పుస్తకరూపంలో తీసుకొచ్చారు. దుర్గాదేవికి నమస్కరిస్తూ 41 రోజులపాటు 41 శ్లోకాలను కీర్తన చేయటం వల్ల మేలుకలుగుతుందని దీనిని పుస్తకం, సీడీ రూపంలోనూ తీసుకొచ్చారు. సంకీర్త నామావళిని గిరిప్రదక్షిణ సమయంలోనూ మైక్‌లో వినిపిస్తున్నారు.

శ్రీ కనకదుర్గా స్తోత్ర లహరి

శ్రీకనకదుర్గా స్తోత్ర లహరి గ్రంథాన్ని సృష్టి లక్ష్మీసీతారామాంజనేయ శర్మ సంకలనం చేయగా, రామారావు దానికి ప్రధాన సంపాదకుడిగా వ్యవహరించారు. పంచశక్తి స్వరూపాల్లో దుర్గాదేవికి అత్యంత ప్రాధాన్యం ఉందని వేదాలు, ఉపనిషత్తులు, ఆగమాలు, దుర్గాదేవి మహాత్మ్యాన్ని అనేక సూక్తాలతో ప్రతిపాదించాయని పేర్కొన్నారు. వేద, ఉపనిషత్తు ఆగమసార భూతమైన దుర్గాదేవి తాత్విక స్వరూపాన్ని భగవంతుడైన వేదవ్యాసుడు దేవీభాగవతం, బ్రహ్మాండ పురాణం, స్కంద పురాణం, మార్కండేయ పురాణాల్లో జగన్మాత వైభవాన్ని వర్ణించారని పేర్కొన్నారు. అమ్మవారిని స్తోత్రప్రియ అంటారని ఎవరైతే స్తోత్రం చేస్తారో వారిపై అమ్మవారి వాత్సల్యం ఉంటుందని, అందుకే స్తోత్రాలను, వైభవోపేత సంఘటనలను అమ్మవారి వైశిష్ట్యాన్ని తెలియజేసేందుకు పుస్తకాలరూపంలో తెస్తున్నట్లు రామారావు చెప్పారు.

శ్రీశైలేశ తీర్థ సారం

శ్రీశైలేశ తీర్థసారం గ్రంథాన్ని 1957లో తాడేపల్లి వెంకటప్పయ్య శాస్త్రి సంస్కృతంలో రాశారు. తర్వాత శ్రిష్టి సీతారామాంజనేయ శర్మ తెలుగులో అనువదించారు. శివాలయాలు, కనకదుర్గమ్మ వైభవాలను పొందుపరిచారు. కృష్ణవేణి నదీమతల్లి విశేష పరమ పావన చరిత్రను రాశారు. ఇంద్రకీలాద్రికి ఆ పేరు ఎలా వచ్చింది? పురాణ విశేషాలు, దుర్గమ్మ గుడిలో శరన్నవరాత్రి ఉత్సవాలు, దుర్గా ఉపాసనలతో పాటు నవదుర్గా స్వరూపిణి కనకదుర్గాదేవి అంటూ నవదుర్గల వైభవం, ప్రాభవంపై ఈ పుస్తకంలో రాశారు.

ఇప్పటికీ సాయమందలే!

- కంచికచర్ల మండలంలోని తొమ్మిది గ్రామాలకు విడుదల కాని వరద సాయం
- బాధితుల్లో పెల్లుబికుతున్న ఆగ్రహం

(ఆంధ్రజ్యోతి-కంచికచర్ల)

మండలంలో కృష్ణానది వరద ముంపు గ్రామాల బాధితులకు ఇంకా ప్రభుత్వ సాయమందలేదు. అధికారులు తొమ్మిది గ్రామాల్లో రీ ఎన్యూమరేషన్ చేసి, నష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. అయినప్పటికీ ప్రభుత్వ సాయం రాకపోవటంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. కంచికచర్ల మండలంలో కొత్తపేట, గనిఆత్కూరు, చెవిటికల్లు, కునికినపాడు, మున్నలూరు, మోగులూరు, ఎస్.అమరవరం, వేములపల్లి, పెండ్యాల గ్రామాలు ఒకవైపు కృష్ణానది, మరోవైపు మునేరు వరద ముంపునకు గురయ్యాయి. గ్రామాలు ద్వీపాలుగా మారాయి. కిలోమీటర్ల దూరం వరద పోటెత్తడంతో అధికారులు పడవల ద్వారానే ముంపు గ్రామాలకు చేరుకున్నారు. గ్రామాల్లోని పలు ఇళ్లల్లోకి రెండు నుంచి ఐదు అడుగుల మేర వరద నీరు చేరింది. బాధితులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సురక్షిత ప్రాంతాలకు వెళ్లి అప్పట్లో తలదాచుకున్నారు. ధాన్యంతో పాటు తిండిగింజలు, గృహోపకరణాలు, విలువైన వస్తువులను నష్టపోయారు. పక్కనే ఉన్న ఇబ్రహీంపట్నం మండలంలోని అన్ని గ్రామాల్లోని బాధితులకు ఒక్కో ఇంటికి రూ.25 వేల వంతున ప్రభుత్వం సాయమందించింది. పక్క మండలంలో అంది తమకు సాయమందకపోవడంతో బాధితుల్లో ఆగ్రహం పెల్లుబికుతోంది. రీఎన్యూమరేషన్ జరిగి నెల కావస్తున్నప్పటికీ సాయం రాకపోవటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెవిటికల్లుకు చెందిన పలువురు మహిళలు గురువారం కంచికచర్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. సాయం అందించాలంటూ నినాదాలు చేశారు.

రీ ఎన్యూమరేషన్ చేసి నెల కావస్తున్నా..

బాధితులకు జరిగిన అన్యాయం గురించి 'మాకు సాయం చేయరా?' అంటూ సెప్టెంబరు 27న ఆంధ్రజ్యోతిలో కథనం రావటంతో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని స్పందించారు. అప్పటి కలెక్టర్ సృజన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అధికారయంత్రాంగంలో కదలిక వచ్చింది. 28వ తేదీ నుంచి తొమ్మిది గ్రామాల్లో రెవెన్యూ అధికారులు రీ ఎన్యూమరేషన్ చేశారు. గ్రామాలవారీగా వరద ముంపు బాధితుల జాబితాలను తయారుచేసి, ఉన్నతాధికారులకు నివేదించారు. అయినప్పటికీ ఇప్పటి వరకు ప్రభుత్వం సాయం విడుదల కాలేదు.

సీఎంకు విన్నవించిన బాధితులు

చెవిటికల్లుకు చెందిన కొంత మంది మహిళలు శనివారం ప్రజాదర్బార్‌లో విన్నవించేందుకు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి వెళ్లారు. అక్కడ సీఎం చంద్రబాబునాయుడును కలిశారు. వరద సాయం అందలేదని వివరిస్తూ..సీఎంకు విజ్ఞాపన పత్రం అందజేశారు. సమస్యను పరిష్కరించి, న్యాయం చేస్తానని సీఎం హామీ ఇచ్చారని బాధితులు పేర్కొన్నారు.



తాహెరా సుల్తానా నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న డీఈవో పీవీజే రామారావు

విద్యా రంగంలో కృష్ణాను ప్రథమ స్థానంలో నిలుపుదాం

- ఉపాధ్యాయులకు డీఈవో పీవీజే రామారావు పిలుపు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): 'కృష్ణా జిల్లాలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారు. విద్యారంగంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలుపుదాం. అందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి.' అని నూతన డీఈవో పీవీజే రామారావు పిలుపునిచ్చారు. శనివారం నూతన విద్యాశాఖాధికారిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డీఈవోగా పనిచేసిన తాహెరా సుల్తానా బదిలీపై వెళుతూ రామారావుకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా నూతన డీఈవో మాట్లాడారు. పదో తరగతిలో మెరుగైన పరీక్షా ఫలితాలు రాబట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తామన్నారు. డీఈవోకు బందరు డీవైఈవో శేఖర్‌సింగ్, ఎంఈవో దుర్గాప్రసాద్, సీఈ బోర్డు సెక్రటరీ షేక్ జాన్‌సాహెబ్, ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రతినిధులు, ఎంఈవోలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు స్వాగతం పలికారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



నందిగామలో మునేటిని తనిఖీ చేస్తున్న సీఐ ఎంవీఎస్ఎస్ఎన్ మూర్తి, మునేటిపై ఎగురుతున్న డ్రోన్

కదిలిన యంత్రాంగం

- ఉచితం మాటున అనుచితం కథనానికి స్పందన
- మూడు టాస్క్‌ఫోర్స్ టీమ్‌ల ఏర్పాటు
- మునేరు, కృష్ణా రీచ్‌లలో డ్రోన్లతో తనిఖీలు

(ఆంధ్రజ్యోతి-నందిగామ, కంచికచర్ల, పెనుగంచిప్రోలు)

అధికార పార్టీ నాయకులు చేస్తున్న ఇసుక దందాపై ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన 'ఉచితం మాటున అనుచితం' కథనానికి అధికార యంత్రాంగం కదిలింది. కృష్ణా, మునేరు నదుల నుంచి నిత్యం వంద లారీలకు పైగా ఇసుకను టీడీపీ నాయకులు తరలిస్తున్నారని, రెవెన్యూ, పోలీస్ అధికారులపై అధికార దర్పం ప్రదర్శిస్తూ అనధికార రవాణా చేస్తున్నారని ఆధారాలతో ప్రచురించడంతో సీపీ ఎస్వీ రాజశేఖరబాబు విజయవాడలో అత్యవసర సమీక్ష నిర్వహించారు. మూడు టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు ఏర్పాటుచేశారు. నందిగామ, కంచికచర్ల, పెనుగంచిప్రోలు మండలాల్లోని మునేరు, కృష్ణా నదులపై డ్రోన్ల సహకారంతో తనిఖీలు చేశారు. ఇసుక తవ్వకాలు జరిపిన ఆనవాళ్లున్న ప్రాంతాలు, డంప్‌లను గాలించారు.

డ్రోన్ల విహారంతో అక్రమార్కుల్లో కలవరం

ఇసుక రీచ్‌ల వద్ద శనివారం డ్రోన్ల ఆకస్మిక విహారం కలకలం రేపింది. టాస్క్‌ఫోర్స్ సీఐ ఎంవీఎస్ఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో ఎనిమిది మంది సభ్యుల బృందం మునేటిపై నందిగామ, కంచల, పెండ్యాల, వేములపల్లి, కృష్ణానదిపై మోగులూరు, మున్నలూరు గ్రామాల్లో డ్రోన్‌తో తనిఖీలు చేశారు. ఎస్బీ సీఐ సతీష్ ఆధ్వర్యంలోని టాస్క్‌ఫోర్స్ బృందం పెనుగంచిప్రోలు మండలం పెనుగంచిప్రోలు అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు గ్రామాల్లో తనిఖీలు చేశారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రమణ ఆధ్వర్యంలోని మరో బృందం లింగాల వద్ద మునేటి పరివాహక ప్రాంతంతో పాటు కృష్ణానదిపై ముక్త్యాల తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ఒక్కసారిగా డ్రోన్లు, పోలీసుల హడావుడితో అక్రమార్కుల్లో కలవరం మొదలైంది. అప్రమత్తమైన అక్రమార్కులు తమ అనుయాయులను డ్రోన్ సర్వే జరుగుతున్న ప్రాంతాలకు పంపి, అక్కడి సమాచారం తమ వద్దకు తెప్పించుకున్నారని తెలిసింది.

దందా తీరిది..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన మరుక్షణం నుంచి నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల టీడీపీ నాయకులు అనధికార మైనింగ్‌కు తెరలేపారు. మునేరు, కృష్ణానదులతో పాటు గత ప్రభుత్వ హయాంలోని డంప్‌లను కూడా దోచేశారు. కీసర, మోగలూరు డంప్‌ల నుంచి కోట్లాది రూపాయల విలువైన ఇసుకను దోచారు. రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం దోపిడీ జరిగినట్లు నిర్ధారించి కొద్దిరోజుల క్రితం ఆరెండు డంప్‌లను సీజ్ చేశారు. అయినా అధికారం చేతుల్లో ఉండగా అధికారులు తమనేమి చేస్తారని షాడో నేత దోపిడీని కొనసాగించారు. రాత్రివేళల్లో నిత్యం వందలాది లారీల ద్వారా ఇసుకను తరలించారు. సీజ్ చేసిన ఇసుకను కూడా ఊడ్చేశారు. కళ్లముందే ఇంత జరుగుతున్నా స్పందించలేని స్థితిలో అధికారులు ఉండిపోయారు. షాడో ఎమ్మెల్యేకు ఎదురు చెప్పే ధైర్యం లేక చేష్టలుడిగి చూస్తుండిపోయారు.

సీఎం హెచ్చరించినా ఆగలేదు

ఇసుక అక్రమ రవాణాపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమీక్షలో ఇసుక దందాలు సహించబోనని ఎమ్మెల్యేలకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. సీఎం హెచ్చరించినా కంచికచర్ల మండలంలో ఒక్క రోజు కూడా ఇసుక అనధికార రవాణా ఆగలేదు. పెండ్యాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తూనే ఉన్నారు. ముఖ్యమంత్రి హెచ్చరికలనే లెక్కచేయని అక్రమార్కులు టాస్క్‌ఫోర్స్‌లను, డ్రోన్లను లెక్క చేస్తారా అని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

200 లారీల లోడింగ్‌కు సన్నాహాలు

శుక్రవారం రాత్రి రెండు వందల లారీలకు ఎస్కవేటర్ల సాయంతో ఇసుకను లోడింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఒక్కో లారీకి సైజు మేరకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ ధర నిర్ణయించారు. ఇసుక లోడింగ్ జరుగుతున్న సమయంలో కంచికచర్ల స్టేషన్‌కు చెందిన ఆరుగురు కానిస్టేబుళ్లు అక్కడికి వెళ్లారు. వారు అక్కడ ఉండగానే ముప్పై వాహనాలకు లోడింగ్ చేసి బయటకు పంపినట్లు తెలిసింది. అక్రమార్కులు అధికార పార్టీ నాయకులు కావడంతో పోలీసులు మిన్నకుండి పోవాల్సి వచ్చింది. ఈతరుణంలో విజయవాడ నుంచి టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు బయలుదేరినట్లు సమాచారం రావడంతో అక్కడి నుంచి జారుకున్నారు.

జగ్గయ్యపేట నియోజకవర్గంలోనూ..

శనగపాడు, అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు, ముక్త్యాల రీచ్‌ల నుంచి భారీగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. తెలంగాణ సరిహద్దున ఉన్న అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు గ్రామాల నుంచి మధిర, ఖమ్మం ప్రాంతాలకు ఇసుకను తరలిస్తున్నారు. పెద్దల కనుసన్నలలో జరిగే ఈ ఇసుక దందాను టాస్క్‌ఫోర్స్ ఏమేరకు కట్టడి చేయగలదో వేచిచూడాలి.

బాణాసంచా నిల్వకు అనుమతి తప్పనిసరి

- అనధికార విక్రయాలు చేస్తే చర్యలు
- కృష్ణా ఎస్పీ ఆర్.గంగాధరరావు హెచ్చరిక

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా పేలుడు పదార్థాల చట్టం కింద చర్యలు తప్పవని కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు హెచ్చరించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముడిసరుకులు తీసుకొచ్చి చాటుమాటుగా బాణాసంచా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామన్నారు. జనావాసాల మధ్య బాణాసంచా గిడ్డంగులు ఏర్పాటు చేయొద్దని హెచ్చరించారు. బాణాసంచా విక్రయ కేంద్రాల వద్ద ఇసుక, అగ్నిమాపక సామగ్రి సిద్ధంగా ఉంచుకోవాలని దుకాణదారులు ఆయన సూచించారు. పోలీసులకు అందరూ సహకరించాలని కోరారు.



పోస్టర్లు ఆవిష్కరించి పశుగణనను ప్రారంభిస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, పశుసంవర్థక శాఖ జేడీ నరసింహులు

పశుసంపదను కాపాడుకుందాం

- పశుపోషకులకు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల పిలుపు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పశుసంపదను కాపాడుకుందామని పశుపోషకులకు ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు పిలుపునిచ్చారు. శనివారం తన కార్యాలయం వద్ద 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని వాల్ పోస్టర్లు ఆవిష్కరించి ఆయన ప్రారంభించారు. పశుగణన సక్రమంగా నిర్వహిస్తే పశువుల సంఖ్య తెలుస్తుందని, సంక్షేమ కార్యక్రమాల అమలుకు వీలవుతుందని ఆయన స్పష్టం చేశారు. పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి ఎన్‌సీహెచ్ నరసింహులు, ఆ శాఖ డీడీ నాగభూషణం, సర్జన్ ఆర్.వెంకట్రావు, సీతారామయ్య పాల్గొన్నారు. అంతకుముందు పశు సంవర్థక కార్యాలయం వద్ద అధికారులు, సిబ్బంది 'స్వచ్ఛభారత్'ను నిర్వహించారు.

కేసీపీలో నాణ్యతా దినోత్సవం

ఉయ్యూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కేసీపీ షుగర్స్ ప్రథమ చైర్మన్, మేనేజింగ్ డైరెకర్ వెలగపూడి మారుతీరావు 92వ జయంతి పురస్కరించుకుని కర్మాగారం ఆవరణలో శనివారం నాణ్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. కేసీపీ సంస్థల వ్యవస్థాపకుడు వెలగపూడి రామకృష్ణ, వెలగపూడి మారుతీరావు విగ్రహాలకు యూనిట్ హెడ్ వై.సీతారామదాసు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించి కార్మికులతో నాణ్యత దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ ముందుచూపుతో చక్కెర పరిశ్రమలో ఎన్నో నూతన సాంకేతిక పరిజ్ఞానం, సంస్కరణలు మారుతీరావు తీసుకొచ్చారని కీర్తించారు. ఈ సందర్భంగా 26మంది కార్మికులకు వైద్యఖర్చుల నిమిత్తం రూ. 4లక్షల ఆర్థిక సాయం చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, ఉద్యోగులు పాల్గొన్నారు.



కేసీపీ షుగర్స్ సంస్థల ప్రథమ చైర్మన్ వెలగపూడి మారుతీరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న యూనిట్ హెడ్ సీతారామదాసు

కంకిపాడు - గుడివాడ రోడ్డు అభివృద్ధి చేయండి

- సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రంగారావు

కంకిపాడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : నిత్యం వేల సంఖ్యలో రాకపోకలు సాగించే కంకిపాడు - గుడివాడ ప్రధాన రహదారిని అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పంచకర్ల రంగారావు డిమాండ్ చేశారు. మండేపూడి నాగభూషణ్‌రెడ్డి భవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగించే గుడివాడ రోడ్డు పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందన్నారు. రోజూ అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. పెనమలూరు, గన్నవరం, గుడివాడ, పామర్రు నియోజకవర్గంలోని అనేక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారన్నారని, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు రహదారి అభివృద్ధికి పాటుపడాలని కోరారు నాయకులు తాడంకి నరేష్, నాంచారయ్య పాల్గొన్నారు.

సెంట్రల్ జోన్ కబడ్డీ మెన్స్ టోర్నమెంట్ విజేతగా ఎస్ఆర్‌కే

- విజేతలకు అభినందన

ప్రసాదంపాడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ జోన్ కబడ్డీ మెన్స్ టోర్నమెంట్ పోటీల్లో ఎస్ఆర్‌కే ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు విన్నర్‌గా నిలిచారని కళాశాల చైర్మన్ బోయపాటి అప్పారావు అన్నారు. శనివారం కంచికచర్ల మిక్ కళాశాలలో జేఎన్టీయూ కాకినాడ యూనివర్సిటీ ఆధ్వర్యంలో సెంట్రల్ జోన్ కబడ్డీ మెన్స్ పోటీలు నిర్వహించారు. ఈ టోర్నమెంట్లో జేఎన్టీయూ పరిధిలోని 45 కళాశాలలు నుంచి 45 జట్లు పాల్గొన్నాయని తెలిపారు. జేఎన్టీయూ కాకినాడ టీమ్ సెలక్షన్‌లో 11 మంది తమ కళాశాల విద్యార్థులు ఎంపికవ్వడం గర్వించదగ్గ విషయమన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ శ్రీకృష్ణ, ప్రిన్సిపాల్ ఎం.ఏకాంబరం నాయుడు, స్పోర్ట్స్ కౌన్సిల్ జేఎన్టీయూ కాకినాడ సెక్రటరీ శ్యామ్‌కుమార్, డైరెక్టర్ సీహెచ్ శరత్ అభినందించారు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125,134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 540

పశుగణన పోస్టర్ ఆవిష్కరణ

గన్నవరం : మండలంలోని గోపవరపుగూడెంలో పశుగణన కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. 21వ అఖిల భారత పశుగణనలో భాగంగా డాక్టర్ రెడ్డెమ్మ సర్పంచ్ నల్లూరి వెంకటేశ్వరరావుతో కలసి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

కార్యకర్తల సంక్షేమమే లక్ష్యం..

పెనమలూరు/ గన్నవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ సమోదు పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం పోరంకి టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర వ్యాప్త టీడీపీ పార్టీ సభ్యత్వ సమోదులో భాగంగా లక్ష రూపాయల సభ్యత్వ రుసుము చెల్లించి ఆయన పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని పొంది టీడీపీ శ్రేణులను ఉత్తేజపరిచారు.



బాధితులకు సహాయనిధి చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే బోడె

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల్లో వివిధ కారణాల వల్ల ఆరోగ్యకరమైన ఇబ్బందుల పడ్డ బాధితులకు షుమారు ఇరవై నాలుగున్నర లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర, కంకిపాడు ఎంపీపీ రాజ్యలక్ష్మి, టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు, పెనమలూరు, కంకిపాడు మండల పార్టీ అధ్యక్షులు కోయ ఆనంద్‌ప్రసాద్, సూదిమళ్ల రవీంద్ర, మారుపూడి ధనకోటేశ్వరరావు పాల్గొన్నారు.

● కార్యకర్తల సంక్షేమమే టీడీపీ లక్ష్యమని పార్టీ నియోజక వర్గ పరిశీ లకులు వడ్రాణం హరిబాబు నాయుడు అన్నారు. స్థానిక టీడీపీ కార్యా లయంలో శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్ రిటైర్డ్ అధ్యాపకులు మద్దుకూరి విజయకుమార్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఉప్పులూరి స్వర్ణకుమారి జాస్తి వెంకటేశ్వరరావు, చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్న, ఆళ్ల గోపాలకృష్ణ, గుజ్జర్లపూడి బాబూరావు, గూడవల్లి నర్సయ్య, జూపల్లి సురేష్, వేములపల్లి శ్రీనివాసరావు, గొడ్డళ్ల చినరామారావు, ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్ SBI RACPC - II గాయత్రినగర్, విజయవాడ వారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

క్రింది షెడ్యూలు దాఖలాస్థిని గోనుగుంట్ల చిన్న ఓబులేషప్ప గారి కుమారుడు గోనుగుంట్ల లేపాక్షి నాయుడు గారు మరియు కొరివి రవి గార్లు వారికి గల చ.గ. 291-72లు స్థలము నందు అపార్టుమెంటు నిర్మించుటకు గాను R.R. Constructions, rep. byits Managing Partner అయిన కోనేరు హరిత గారితో కలసి క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థిలో అపార్టుమెంట్‌లను నిర్మించుటకు రిజిష్టరు డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కం జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజు నెం. 2619/2016ను మరియు నెం. 2168/2016రు దస్తావేజు రిజిష్టరు చేయించుకుని పోరంకి గ్రామ పంచాయితీ వారి నుండి అప్రూవల్ ప్లాన్ పొంది వున్నారు. అట్లు నిర్మించిన Apartment flats లను విభజించుకొని Regd. Partition దస్తావేజు నెం. 7674/2019 రుగా రిజిష్టరు చేసుకొని సదరు పార్టిషన్ దస్తావేజు ద్వారా A-Schedule దాఖలా ఆస్థి గోనుగుంట్ల లేపాక్షి నాయుడు కు సంక్రమించి వారి స్వాధీన హక్కు భుక్తములో గల ఆస్థి అయివుండి వున్నది అని, సదరు ఆస్తికి సంబంధించిన లింకు దస్తావేజులు నెం. 11307/2014 మరియు 7694/2015లు గిరవీలు కాజడినవి అని తెలియజేసినారు. క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థిని శ్రీ గోనుగుంట్ల లేపాక్షి నాయుడు నుండి లచ్చి నాగాంజనేయులు గారి భార్య లచ్చి నాగమణి క్రయం పొందుటకు విక్రయ ఖరారు చేసుకుని, నా క్లయింట్ బ్యాంక్ అయిన State bank of India RACPC-II వారి నుండి లోను పొందగోరియున్నారు. కావున నా క్లయింటు బ్యాంక్ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థిని కొనుగోలు చేయుటకు లోన్ ఇచ్చుటకు ఎవరికి అయిన ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన 7 రోజులలోపు వారి అభ్యంతరములు గాని, క్లయిమ్‌లుగాని, కోర్టు జప్తులు గాని తనఖాలు గాని మరియే ఇతర అభ్యంతరములు గాని ఉన్న యెడల క్రింది తెలిపిన అడ్రసునకు Regd. Post with ACK Due ద్వారా వారి అభ్యంతరములను తెలియజేయగలరు. లేని యెడల అపై వచ్చు అభ్యంతరములు గాని, క్లయిమ్‌లు గాని నా క్లయింట్‌ను బైండు చేయజాలవు అని యావన్మందికి తెలియజైయటమైనది.

షెడ్యూలు :1వ అయిటం (స్థలం వివరము) : లోగడ కృష్ణాజిల్లా, ప్రస్తుతం యన్.టి.ఆర్.జిల్లా, కంకిపాడు సబ్‌రిజిష్ట్రారు వారి యిలాకా, పోరంకి గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన, పోరంకి గ్రామ ఆర్.ఎస్.నెం. 120/1రు దాఖలా చ.గ. 188.86లు స్థిరాస్తికి హద్దులు : తూర్పు : 12 మీటర్లు వెడల్పు గల రోడ్డు, దక్షిణము : మాలో 2వ వారి తాలూకు మిగతా ఆస్తి, పడమర : కోటకూర వెంకట శివ ప్రసాద్ గారి ఆస్థి, ఉత్తరము : 80 అడుగుల వెడల్పు గల రోడ్డు. యీ నాలుగు హద్దుల మధ్య చ.గ. 188.86లు లేక చ.మ.ఈ 157.91ల్ల స్థిరాస్తి నివేశన స్థలములో జాయింటు అనిర్దిష్టపు / అవిభాజ్యపు జాయింటు హక్కు గల ఆస్తి అనగా చ.గ. 62.953లు లేక చ.మీ. 52.63ల్ల స్థిరాస్తి స్థలమున్నా మరియు

2వ అయిటం (కట్టడ వివరములు) : పై 1వ ప్రతి దాఖలా స్థలములో **ఆర్.కె. రెసిడెన్సీ** అను పేరుతో నిర్మించిన అపార్ట్‌మెంట్ కట్టడములలో గ్రౌండు ఫ్లోరులోని ఫ్లాట్ నెం. 101రు (త్రిబుల్ బెడ్‌రూం) కట్టడములకు హద్దులు : తూర్పు : కామన్ కారిడార్, దక్షిణము : ఓపెన్ టు స్కై, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరము : స్టెయిర్‌కేస్, కామన్ కారిడార్

యీ నాలుగు హద్దుల మధ్య చ.అ. 1302.0 లు ప్లింతేరియా గల ఫ్లాట్ కట్టడములు, చ.అ. 325.0లు విస్తీర్ణము గల కామన్ ఏరియా, సదరు ఫ్లాట్‌కు సంబంధించిన యావద్విశిష్ట కలప వగైరా సామాను సహా, అందలి ఎలక్ట్రికల్ ఫిట్టింగ్స్, ఎటాచ్డ్ లెట్రిన్, బాత్రూమ్, నీటి పంపు వగైరా వసతి సౌకర్యములతో సహా. చ.అ. 200.0లు విస్తీర్ణము గల కార్ పార్కింగ్‌తో సహా, సదరు అపార్ట్‌మెంట్ కట్టడములకు సంబంధించిన మెట్లు, డ్రైనేజి, లిఫ్ట్, వాటర్, కామన్ ఫెసిలిటీస్, కామన్ కారిడార్, కామన్ ఏరియాతో సహా, దామాషాన మెయిన్‌టెనెన్స్ మరియు రిపేరింగ్ ఛార్జీలు భరించెడి ఏర్పాటుతో సహా యావత్తు యూజ్‌మెంట్ హక్కులతో సహా.

Y. VIJAYA KUMAR, Advocate
D.No. 20-4-21, Near Lotus Land Mark, Santhinagar, Vijayawada-3. Cell : 99490 77010

బాణసంచా విక్రయాల్లో జాగ్రత్తలు పాటించాలి

ఉయ్యూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : బాణసంచా విక్రయించే దుకాణాల వద్ద ప్రమాదాలకు తావు లేకుండా జాగ్రత్తలు పాటించాలని ఉయ్యూరు ఆర్డీవో బీఎస్ హెలా షారోన్ అన్నారు. బాణసంచా దుకాణాల ఏర్పాటుకు కేటాయించిన వీరమ్మ ఆలయ ప్రాంగణాన్ని శనివారం తహసీల్దార్ సురేశ్ కుమార్‌తో కలసి పరిశీలించి సూచనలు చేశారు.

కూటమి అభ్యర్థి రాజాని గెలిపించాలి

పెనమలూరు, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి) : రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాను గెలిపించి టీడీపీ శ్రేణులు తమ సత్తాచాటాలని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

●ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు అత్యధిక మెజారిటీతో గెలిపించుకో వాల్సిన బాధ్యత అందరి పైన ఉందని టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు వడ్రాణం హరిబాబు నాయుడు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గ్రాడ్యుయేట్ ఓటు నమోదు దరఖాస్తు ప్రక్రియను శనివారం పరిశీలించారు. చిరుమామిళ్ల సూర్యం, మేడేపల్లి సురేష్, బుస్సే నాగ ప్రసాద్, తంగిరాల శ్రీనివాసరావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లవల్లి స్కూల్‌లో ఐరన్ రాడ్లు చోరీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 26 (ఆంధ్ర జ్యోతి) : హైస్కూల్ అభివృద్ధి పనులకు కేటాయించిన ఇనుప చువ్వలు (ఐరన్ రాడ్లు)ను చోరీ చేసిన ఘటన శుక్రవారం జరిగింది. మల్లవల్లి హైస్కూల్ అభివృద్ధి, అదనపు తరగతి గదుల నిర్మాణానికి అవసరమైన ఇనుప చువ్వలు (సుమారు 3టన్నులు) పాఠశాల ఆవరణలోనే గొలుసులతో కలిపి తాళాలు వేసి ఉంచారు. గుర్తుతెలియని వ్యక్తులు తాళాలను బద్దలు కొట్టి చువ్వలను చోరీ చేశారు. ఈ మేరకు హెచ్‌ఎం, ఎస్ఎంసీ ఛైర్మన్లు వీరవల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.





















ఓపెన్ హౌస్‌లో ప్రదర్శించిన ఆయుధాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న పోలీసులు

సాయుధం.. ఆయుధం

ఏఆర్ గ్రౌండ్స్‌లో పోలీసు ఓపెన్ హౌస్

● ప్రదర్శనలో పోలీసు ఆయుధ సంపత్తి ● హాజరైన విద్యార్థులు
● అలరించిన డాగ్‌షో ● ఆసక్తిగా తిలకించిన భావిపౌరులు

ఏకే 47... 9ఎంఎం కోల్ట్... లేజర్ గన్... బాంబు లాంచర్... పోలీసుల అమ్ములపొదిలో ఉన్న ఆయుధ సంపద ఇది. నిత్యం కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉండే ఈ ఆయుధాలు ఏడాదిలో ఒక్కసారి మాత్రమే బయటకు వస్తాయి. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించే ఓపెన్ హౌస్‌లో కొలువు దీరతాయి. విజయవాడ ఎంజీ రోడ్డులోని ఏఆర్ గ్రౌండ్స్‌లో శనివారం నిర్వహించిన ఓపెన్‌హౌస్‌ను ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ప్రారంభించారు. ఆయన వెంట డీసీపీలు గౌతమీషాలి, తిరుమలేశ్వరరెడ్డి, మురళీకృష్ణనాయుడు, ఉదయరాణి, ఏడీసీపీ జి.రామకృష్ణ ఉన్నారు. నగరంలోని విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఈ ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

ఉగ్రదాడులకు అవకాశం ఉందన్న సమాచారంతో వాటినెలా ఎదుర్కోవాలన్న ఆలోచనలతో ఆక్టోపస్ కొత్త ఆవిష్కరణ చేసింది. ముంబైలో ఉగ్రదాడులు నేర్పిన పాఠాలు, నాడు బలగాలు వైపున కనిపించిన లోపాలను బేరీజు వేసుకుని ఆక్టోపస్‌లోని శాట్ కాంబోట్ వింగ్ ఈ నూతన ఆవిష్కరణ చేసింది. దీనికి కస్టమైజ్డ్ పవర్ వీల్ చైర్ అని నామకరణం చేసింది. ఉగ్రవాదులు దాడులకు వ్యూహాలు రచిస్తున్నప్పుడు ఆ సమాచారాన్ని నిఘా వర్గాలు రాష్ట్ర పోలీసు విభాగానికి అందజేస్తాయి. దాడులకున్న భవనాలను, ప్రాంతాలను ఈ వీల్ చైర్ ద్వారా వీడియో రికార్డింగ్ చేస్తారు. ఇందుకోసం ఆక్టోపస్ ముందుగా అమెరికా నుంచి 360 డిగ్రీల కోణంలో వీడియో రికార్డింగ్ చేసే కెమెరాలు కొనుగోలు చేసింది. దీన్ని అమర్చడానికి ఒక వీల్ చైర్‌ను సొంతంగా ఆక్టోపస్ తయారు చేసుకుంది. బ్యాటరీ ఆధారంగా నడిచే వీల్ చైర్‌కు వీడియో రికార్డింగ్ కెమెరాలున్న స్టాండ్‌ను అమర్చారు. ఆక్టోపస్‌లోని సిబ్బంది కుర్చీలో కూర్చుని ముందుకెళ్తూ భవనం మొత్తాన్ని రికార్డింగ్ చేస్తుంది. దానికున్న ప్రవేశ ద్వారాలు, బయటకున్న మార్గాలను రికార్డు చేస్తుంది. తద్వారా బ్లూ ప్రింట్ తీసుకొని త్రీడీ ఫొటోలను రూపొందిస్తారు. వాటిని ఆపరేషన్‌లో పాల్గొన్న సిబ్బందికిస్తారు. రెస్క్యూ ఆపరేషన్ జరిగినప్పుడు వాటిని పరిశీలిస్తూ కమ్యూనికేషన్ సిబ్బంది వ్యూహాలను అందజేస్తుంది. ఇందులోని కెమెరాలు భవనం ఉన్న వీధుల్లో సైతం గూగుల్ మ్యాప్‌ను ఇస్తాయి. ఆపరేషన్‌కు ముందు మాత్రమే ఈ కస్టమైజ్డ్ పవర్ వీల్ చైర్‌ను ఉపయోగిస్తారు. దేశంలో ఇలాంటి పరికరం ఆక్టోపస్ వద్ద మాత్రమే ఉంది.



ఆందోళనకారులపై 'వాటర్ ఫైరింగ్'



ఆందోళనకారులు భారీగా గూమిగూడినప్పుడు వారిని చెదర గొట్టడానికి పోలీసులు వేర్వేరు వ్యూహాలను అనుసరిస్తారు. అందులో టియర్ గ్యాస్ ఒకటి, వాటర్ ఫైరింగ్ రెండు. నిరసనలు, ఆందోళనల సమయంలో రహదారులపైకి వారిని చెదరగొట్టడానికి ముందుగా వాటర్ ఫైరింగ్ చేస్తారు. అయినా ఆందోళనకారులు రహదారులపైనే ఉంటే టియర్ గ్యాస్ ప్రయోగిస్తారు. పోలీసు ఓపెన్ హౌస్‌లో వాటర్ ఫైరింగ్‌ను ప్రదర్శించారు. ఇది విద్యార్థులను బాగా ఆకట్టుకుంది. వాటర్ ఫైరింగ్ జరుగుతున్నంత సేపు విద్యార్థులు అరుపులు, కేకలు వేసి ఎంజాయ్ చేశారు.

ఆక్టోపస్ 'నేత్ర'

నేత్ర వీ3 ప్లస్. ఆక్టోపస్‌లోకి కొత్తగా ప్రవేశించిన డ్రోన్ ఇది. ఉగ్రదాడులను ఎదుర్కోవడానికి ఆక్టోపస్ ఉపయోగిస్తున్న టెక్నాలజీలో ఇది అధునాతన పరికరం. ముంబైలోని ఐడియా ఫోర్జ్ సంస్థ తయారు చేసిన ఈ నేత్ర డ్రోన్‌ను ఆక్టోపస్ ఈ ఏడాది మార్చిలో రూ.30లక్షలకు కొనుగోలు చేసింది. ఇది 6 కిలోల పేలోడ్‌ను తీసుకెళ్లగలదు. గంటకు 5కిలోమీటర్ల దూరం, 500 మీటర్ల ఎత్తుకు ఎగర గలదు. దీనికి 10 కిలోల బరువున్న వస్తువులను మోసే సామర్థ్యం ఉంది. దీనికున్న జీపీఎస్ పనిచేయలేని పక్షంలో సిగ్నల్స్ అందజేయడానికి ప్రత్యేకంగా ఒక యాంటీనా ఉంటుంది. ప్రస్తుతం ఈ నేత్రను నిఘా కోసం ఆక్టోపస్ ఉపయోగిస్తోంది.

ఆకట్టుకున్న డాగ్ షో



నేరగాళ్లను ట్రాక్ చేయడానికి, అనుమానాస్పద వస్తువులను గుర్తించడానికి పోలీసులు డాగ్ స్క్వాడ్‌ను ఉపయోగిస్తారు. సీఎస్ డబ్ల్యూ (సిటీ సెక్యూరిటీ వింగ్)లో మొత్తం 11 డాగ్స్ ఉన్నాయి. వాటిలో ఐదింటితో ఓపెన్ హౌస్‌లో విన్యాసాలు చేయించారు. ట్రైనర్స్‌తో కలిసి మార్చ్ చేశాయి. అధికారులకు సెల్యూట్ చేసి, పూలబొకేలను అందజేశాయి. ఈ షోను విద్యార్థులు ఉల్లాసంగా తిలకించారు.

ఆక్టోపస్‌లో 'ఎమ్మార్వో'

ఉగ్రదాడులకు పరిధులుండవు. టార్గెట్ చేసుకున్న ప్రాంతంలో విధ్వంసం సృష్టించాలనుకున్నప్పుడు బాంబులు అమర్చుతారు. ఈ బాంబులు ఏ ప్రదేశంలో ఎక్కడ పెట్టారో వారికి తప్ప మిగిలిన వారికి తెలియదు. ఈ బాంబులను వెలికి తీయడానికి ఆక్టోపస్ ఎమ్మార్వోను ఉపయోగిస్తుంది. కెనడా నుంచి రూ.1.57కోట్లతో మినీ రిమోట్లీ ఆపరేట్ వెహికల్‌ను కొనుగోలు చేశారు. ఈ ఎమ్మార్వోలో కమాండ్ కంట్రోల్ యూనిట్, రోబోట్ ఉంటాయి. కమాండ్ కంట్రోల్ యూనిట్ ఇచ్చిన ప్రోగ్రాంను బట్టి రోబోట్ నడుచుకుంటుంది. దీనికి వాహనాల మాదిరిగా గేర్లు ఉంటాయి. మొదటి గేర్‌లో రోబోట్ గంటకు 1.5 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. రెండో గేర్‌లో మూడు, మూడో గేర్‌లో గంటకు 8కిలోమీటర్లు ప్రయాణం చేస్తుంది. రోబోట్‌లో ఉన్న కెమెరాలు ఆ ప్రదేశాలను కమాండ్ కంట్రోల్ యూనిట్ మానిటర్‌లో చూపిస్తాయి. దాని ప్రకారం కమాండర్ కమాండ్స్ ఇస్తారు. ఈ రోబోట్ భూమిలో పాతిపెట్టిన బాంబులను వెలికి తీయగలదు. గుర్తించిన బాంబులను సురక్షిత ప్రదేశంలో పడేస్తుంది. ఎక్కడైనా సూట్‌కేస్‌లో బాంబు ఉన్నట్టు గుర్తిస్తే దాన్ని పట్టుకుని తీసుకెళ్తుంది. రోబోట్ తీసుకెళ్లే వస్తువులను పట్టుకోవడానికి వేర్వేరు చిన్న పరికరాలున్నాయి. ఇది భూమిపై నడవడమే కాకుండా మెట్లు ఎక్కగలదు. ఈ రోబోట్ పై తుపాకీని అమర్చుకునే సదుపాయం ఉంది. ఉగ్రవాదులు ఒక ఇంట్లో గుంపుగా ఉన్నప్పుడు తుపాకీని అమర్చి రోబోట్‌ను పంపితే కాల్పులు చేసే సామర్థ్యం ఈ ఎమ్మార్వోకు ఉంది. ఈ అత్యాధునిక ఆయుధాన్ని దేశంలో తొలుత కొనుగోలు చేసిన విభాగం ఆక్టోపస్. తరువాత ఇటీవల ప్రధానమంత్రి భద్రతను పర్యవేక్షించే ఎస్ఎస్‌జీ కొనుగోలు చేసింది. ఏకే 47, 9ఎంఎం కోల్ట్, ఎంపీ 5ఏ3, ఎస్పీఏఎస్ (స్పెషల్ పర్పస్ ఆటోమేటిక్ షార్ట్‌గన్) వంటి ఆయుధాలను ఈ రోబోట్ ఆపరేట్ చేస్తుంది. దీనికి ఒకసారి చార్జింగ్ పెడితే 4 గంటలు పనిచేస్తుంది. 14వాట్స్ బ్యాటరీతో ఈ మొత్తం పరికరం కార్యకలాపాలు నిర్వహిస్తుంది. ఉగ్రవాదులు చేతుల్లో బందీలుగా ఉన్నవారి వద్దకు ఈ రోబోట్ వెళ్లినప్పుడు కమాండర్ మాటలు వినిపించడానికి దానిలో ఒక స్పీకర్ ఉంటుంది. అక్కడున్న పరిస్థితులను బందీలుగా ఉన్నవారు చెప్పే మాటలు ఈ స్పీకర్ ద్వారా కమాండర్‌కు వినిపిస్తాయి.

విద్యార్థులకు అన్ని విషయాలను వివరిస్తాం
ఎస్వీ రాజశేఖర్‌బాబు, పోలీసు కమిషనర్



ఏఆర్ గ్రౌండ్స్‌లో రెండు రోజులపాటు ఓపెన్ హౌస్‌ను నిర్వహిస్తున్నాం. ఈ రెండు రోజుల్లో పోలీసుల వద్ద ఉన్న ఆయుధాలు గురించి వివరిస్తాం. ఆక్టోపస్, డాగ్‌స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌లోని ఆయుధాలు చూపిస్తాం. అన్నింటికంటే ఆక్టోపస్ వద్ద అత్యాధునిక ఆయుధాలున్నాయి. వాటి గురించి విద్యార్థులు తెలుసుకోవాలి. అలాగే సైబర్ క్రైం గురించి అవగాహన కల్పిస్తారు. రహదారి భద్రత విషయాలను ట్రాఫిక్ పోలీసులు చెబుతారు.



అవగాహన పెంచుకుంటే.. సైబర్‌కే డర్

పెట్టుబడులు పెట్టి లక్షలు కోల్పోయారు కొందరు. డిజిటల్ అరెస్టు అనగానే హడలిపోయి డబ్బులు డిపాజిట్ చేశారు కొందరు. సైబర్ క్రైం పోలీసుస్టేషన్‌కు నిత్యం వస్తున్న కేసులివి. ఓపెన్ హౌస్‌లో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ పోలీసులు స్టాల్‌కు వచ్చిన విద్యార్థులకు 16 రకాల సైబర్ నేరాల గురించి వివరించారు. సైబర్ నేరాలకు సంబంధించి టాల్‌మ్యాన్ షో ఆకట్టుకుంది. సైబర్ నేరగాడిని పోలీసులు సంకెళ్లు వేసి తీసుకెళ్తున్నట్టుగా ప్రాంగణం మొత్తం తిరిగారు.

లాజిస్టిక్ పార్క్ అభివృద్ధికి భూమి అప్పగించండి

● సీఎం చంద్రబాబుకు ఎంపీ చిన్ని విజ్ఞప్తి



అమరావతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా కొండపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో లాజిస్టిక్ పార్క్ అభివృద్ధికి ఆసక్తి చూపిన స్థలాన్ని కేటాయించాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో సీఎం చంద్రబాబును ఎంపీ చిన్ని కలిసి, ఎన్‌హెచ్ఏఐకి స్థలం అందజేయడానికి ఏపీసీఆర్‌డీఏకు అవసరమైన భూమిని అప్పగించాల్సిందిగా ఏపీజెన్‌కోను ఆదేశించాలని కోరారు. అలాగే విజయవాడలోని పాత రాజరాజేశ్వరిపేటలో రైల్వేశాఖకు చెందిన స్థలంలో నివాసముంటున్న నివాసితులు 15 రోజుల్లో ఖాళీ చేయాలని రైల్వే అధికారులు చాటింపు వేయించారని, తమ ఇళ్లను కూల్చివేసి, ఖాళీ చేయిస్తారని బాధితులు ఆందోళన చెందుతున్నారని సీఎంకు ఎంపీ వివరించారు. తక్షణం కూల్చివేత చర్యలను నిలిపేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ రెండు అంశాలపై సీఎం సానుకూలంగా స్పందించారు.

ఫిడే రేటింగ్ చెస్ క్లాసిక్, ర్యాపిడ్ విజేతలు వీరే



విజేతలతో రాష్ట్ర పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ బాబు ఏ, ఇతర అతిథులు

● ఓవరాల్‌గా తమిళనాడు ప్లేయర్స్ సత్తా

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉత్కంఠగా జరుగుతున్న బీఎన్‌కేయూ తొలి ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్‌లో 9 రౌండ్లు పూర్తయ్యేసరికి శనివారం నాటికి ఓపెన్ విభాగంలో నీలాష్ సాహా (8 పాయింట్లు, పశ్చిమ బెంగాల్) విజేతగా అవతరించాడు. రన్నరప్‌గా కౌత్సవ్ కుండు (7.5 పాయియింట్లు, పశ్చిమ బెంగాల్), మూడో స్థానంలో వెంకటేష్ ఎంఆర్ (7.5 పాయింట్లు, తమిళనాడు) నిలిచారు. రేటింగ్ క్యాటగిరి (1650-1900)లో ఎస్ సిద్ధాంత్ (మహారాష్ట్ర), ప్రణవ్ ఏజే (కర్ణాటక), సాయికత్ నాథ్ (ఢిల్లీ) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు. రేటింగ్ క్యాటగిరి (1400-1649)లో మల్లికార్జునరావు (ఆంధ్రప్రదేశ్), దినేష్ కేపే (తమిళనాడు), అంజన ఏ (తమిళనాడు) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలను వశం చేసుకున్నారు. బెస్ట్ అన్‌రేటెడ్ కేటగిరిలో సుదర్శన్ బాలాజీ (తమిళనాడు), మాంగ్య పి (తెలంగాణ), శ్రీ కృష్ణ గణేషన్ (తమిళనాడు) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను వశం చేసుకున్నారు. ఫిడే బ్లిట్జ్ రేటింగ్ చెస్‌లో 524 మంది తలపడాల్సిన లీగ్ పద్ధతిలో 9 రౌండ్లు పోటీలు నిర్వహించగా, ఓపెన్ విభాగంలో గ్రాండ్ మాస్టర్ లక్ష్మణ్ ఆర్ఆర్ (తమిళనాడు), ఇంటర్నేషనల్ మాస్టర్ రవితేజ (ఏపీ), ఇంటర్నేషనల్ మాస్టర్ శర్వాన కృష్ణన్ (తమిళనాడు) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను వశం చేసుకున్నారు. విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతుల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర పన్నులశాఖ చీఫ్ కమిషనర్ బాబు ఏ హాజరుకాగా, ప్రత్యేక అతిథిగా చైర్మన్ వీవీఐపీ కాలేజ్ చైర్మన్ వాసిరెడ్డి వెంకటాద్రి విద్యాసాగర్, ఐకాన్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ కే రాజేంద్ర, ఐకాన్ స్కూల్ చైర్మన్ వై పార్థసారథి, టోర్నీ కన్వీనర్ షేక్ ఖాసీమ్, బీఎన్‌కేయూ టోర్నమెంట్ డైరెక్టర్ విత్తనాల కుమార్, ట్రెజరర్ నరేష్, ఇంటర్నేషనల్ ఆర్బిటర్ అమ్మినేని ఉదయ్‌కుమార్ నాయుడు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ రాష్ట్ర బాక్సింగ్ చాంపియన్‌షిప్

నగరంలోని కృష్ణలంక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉమ్మడి కృష్ణా ఆధ్వర్యంలో 68వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లాల (రాష్ట్రస్థాయి) బాలబాలికల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌ను ఈ నెల 27 నుంచి 29 వరకు నిర్వహిస్తున్నట్టు టోర్నీ సెక్రటరీ వీ రవికాంత తెలిపారు. ఈ పోటీలను ఆదివారం ఉదయం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభిస్తారని, ఎస్‌జీఎఫ్ అండర్-19 ప్రెసిడెంట్ సీఎస్ఎస్ఎన్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారన్నారు.

పట్టభద్రులూ.. ఓటు నమోదు చేసుకోండి!

● ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్



మాట్లాడుతున్న ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్

వన్‌టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులైన ప్రతిఒక్కరూ శాసనమండలిలో పట్టభద్రుల ప్రతినిధిగా మంచి నేతను ఎన్నికునేందుకు ఓటరుగా నమోదు కావాలని ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ కోరారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో అసోసియేషన్ హాల్‌లో శనివారం జరిగిన పశ్చిమ కృష్ణాజిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాలూకా కేంద్రంలోని ఎన్జీవో హోమ్‌లో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుకు సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఎలాంటి ఇబ్బందులొచ్చినా సహాయక కేంద్రాల్లో పరిష్కరించుకోవాలన్నారు. ఉద్యోగుల పెండింగ్ బకాయిలను త్వరలో చెల్లించాలని, పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు పడిన ఇబ్బందులను గుర్తు చేశారు. రూ.20వేల కోట్లకు పైగా ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందన్నారు. సీపీఎస్ రద్దు కోసం ఇంకా బకాయిల చెల్లింపుల కోసం ఆందోళన చేస్తున్న వారిపై 4వేల కేసులను బనాయించిందన్నారు. పెన్షనర్లకు అదనపు క్వాంటం పెన్షన్‌ను 2018లో ప్రభుత్వం మంజూరు చేస్తే గత ప్రభుత్వం కోత విధించిందన్నారు. సీఎం చంద్రబాబు ఉద్యోగులపై పెట్టిన కేసులను సమీక్షించి ఎత్తివేస్తామని అసెంబ్లీలో ప్రకటించారన్నారు. ఇప్పుడు ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు, పెన్షన్‌లు వస్తున్నాయని, సాధ్యమైనంత త్వరలో ఉద్యోగుల బకాయిలను చెల్లించేలా కృషి చేస్తామన్నారు. ఈలోగా మధ్యంతర భృతిని ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తామన్నారు. ఎన్జీవో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.సత్యనారాయణ రెడ్డి, అసోసియేషన్ బాధ్యులు పాల్గొన్నారు.

సైబర్ పీఎస్‌లో జీరో ఎఫ్ఐఆర్

విజయవాడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విజయవాడ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదైంది. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం తాడిగడపకు చెందిన తరకటూరి అనురాగ్ ఆన్‌లైన్‌లో సైబర్ నేరగాళ్లు పంపిన లింక్‌లో లాగిన్ అయి పెట్టుబడి పెట్టాడు. మొత్తం రూ.1.79కోట్లను సైబర్ నేరగాళ్లు జమ చేయించుకున్నారు. పెట్టుబడి పెట్టడం తప్ప రిటర్న్ లేకపోవడంతో మోసపోయానని గుర్తించిన అనురాగ్ పోలీసు కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశాడు. దీనిపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సైబర్ క్రైం పోలీసులకు ఆదేశాలిచ్చారు. ఇన్‌స్పెక్టర్ గుణరాము జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కృష్ణా జిల్లాకు బదిలీ చేశారు. సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ ఏర్పాటయ్యాక జీరో ఎఫ్ఐఆర్ నమోదు ఇదే ప్రథమమని పోలీసులు తెలిపారు.

టీడీపీ సభ్యత్వంపై ప్రజల్లో ఆసక్తి: ఎంపీ



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

విద్యాధరపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు పాలన చూసి టీడీపీలో సభ్యులుగా చేరేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. టీడీపీ సభ్యత్వం తీసుకోవటం ఎంతో గౌరవప్రదమని వారు భావిస్తున్నారన్నారు భవానీపురం 40వ డివిజన్‌లో శనివారం టీడీపీ సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించారు. బ్యాంక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, అధికార ప్రతినిధి నాగుల్ మీరా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్ పాల్గొన్నారు. తొలుత వీరు ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శివనాథ్ మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం తీసుకున్నవారికి గతంలో రూ.2లక్షలుగా ఉన్న ప్రమాద బీమాను రూ.5లక్షలకు పెంచటం హర్షదాయకమని, నేతలు, కార్యకర్తలు ఇందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు. సభ్యత్వ రూ.100ల సభ్యత్వంతో కార్యకర్తలకు ప్రమాద బీమా వర్తిస్తుందని, ఇదే సమయంలో సభ్యుల కుటుంబాల్లో విద్య, వైద్యం, ఉపాధి కోసం టీడీపీ అండగా ఉంటుందన్నారు. సభ్యత్వ కార్డు ఉన్న వ్యక్తి చనిపోయినట్టయితే మట్టి ఖర్చుల కింద రూ.10వేలు అందజేస్తారన్నారు. పార్టీ 40వ డివిజన్ అధ్యక్షుడు చిన సుబ్బయ్య, నేతలు నారాయణ, శివశర్మ, సురభి బాలు పాల్గొన్నారు.

సోనోవిజన్‌లో రూ. లక్ష వరకు నగదు బహుమతులు



అదిగదిగో..

నవలోకం

కొత్తరూపు సంతరించుకున్న నవలంక


● వరదల అనంతరం మరింత అబ్బురపరుస్తున్న ఇసుక తిన్నెలు
● పోటెత్తుతున్న ప్రకృతి ప్రేమికులు

ఆంధ్రజ్యోతి - అవనిగడ్డ: చిన్నచిన్న ఇసుక తిన్నెలతో ఉండే నవలంక నేడు పర్యాటక ప్రేమికులే ఆశ్చర్యపోయేలా సరికొత్త అందాలను సంతరించుకుంది. కృష్ణాజిల్లాలోని తీర ప్రాంత మండలాల్లో ఒకటైన నాగాయలంకకు ఇటీవల వచ్చిన భారీ వరదల సమయంలో కృష్ణమ్మ గర్భం నుంచి సరికొత్త అందాలతో నవలంక పునరుద్భవించింది. ఉదయించే సూర్యకిరణాల వెలుగులో జిగెలుమనిపించే మెరిసే గడ్డిపూలు, కాసేపట్లో అస్తమించే సూర్యబింబం ముందు మనల్ని పలకరించేందుకు వస్తున్నాయా అన్నట్టుండే సముద్రపు పక్షుల గుంపు మనల్ని చూపుతిప్పుకోనివ్వవు. ముఖ్యంగా సూర్యాస్తమ మనోహర దృశ్యాలతో పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునే నాగాయలంక శ్రీ రామపాదక్షేత్రం సమీపంలోని ఈ నవలంక దీవి ఉంది. ప్రకృతి రమణీయ అందాలతో తులతూగే నవలంకను సందర్శించాలంటే ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నుంచి అవనిగడ్డ మీదుగా నాగాయలంక ప్రతి అరగంటకు ఒక బస్సు అందుబాటులో ఉంటుంది. కరకట్ట ఎక్స్‌ప్రెస్ బస్సు ఎక్కితే విజయవాడ, రామలింగేశ్వర నగర్ దాటిన దగ్గర నుంచి పులిగడ్డ వరకు దాదాపు 60 కిలోమీటర్ల పొడవున వివిధ పంటలతో లంక భూములు కనువిందు చేస్తాయి. పచ్చని చెట్లతో ఆకాశానికి కప్పు వేశారా అన్నట్లు కరకట్ట పొడవునా ఇరువైపులా కనిపించే చెట్లు పర్యాటకులకు కొత్త అనుభూతులు మిగులుస్తున్నాయి. కరకట్ట ప్రయాణంతో అవనిగడ్డ మీదుగా నాగాయలంక చేరుకొంటే బస్సు దిగిన దగ్గర నుంచి కేవలం అర కిలోమీటరు దూరంలోనే శ్రీరామపాదక్షేత్రం ఘాట్ వస్తుంది. ఈ ఘాట్ వద్ద నుంచి స్థానిక మత్స్యకారులు తమ పడవల్లో పర్యాటకులను నది మధ్యలో అందంగా కనిపించే నవలంకకు తీసుకెళ్తారు. ఇందుకోసం వారు రూ.300-400 వరకు చార్జ్ చేస్తారు. అయితే నవలంక అందాలు పూర్తిస్థాయిలో ఆస్వాదించాలంటే సాయంత్రం 4 గంటల సమయం దాటితేనే కాని కుదరదు. కాబట్టి ఈ అంతకంటే ముందు ఈ ప్రాంతానికి వస్తే మాత్రం అవనిగడ్డ లంకమ్మ అమ్మవారిని, శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని (గాలిగోపురంగుడి) దర్శించుకుని సాయంత్రం సూర్యాస్తమ సమయానికి నాగాయలంక చేరుకుని నవలంక అందాలు ఆస్వాదించవచ్చు. పులిగడ్డ వద్ద కృష్ణానది రెండుగా చీలి ఒక పాయ హంసలదీవి సమీపంలో సాగరంలో సంగమిస్తే, మరో పాయ వేణీ నదిగా మారి నాగాయలంక దిగువన సాగురుడితో సంగమిస్తుంది. అందుకే నాగాయలంక శ్రీరామపాదక్షేత్రాన్ని వేణీ సంగమ క్షేత్రంగా పిలుస్తారు. ఇక్కడ నది అంచున నిర్మించిన శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం, కనకదుర్గమ్మవారి ఆలయం, సత్యనారాయణ స్వామి ఆలయం, రాముల వారి ఆలయం, శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం, పునర్నిర్మాణంలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంతో ఆధ్యాత్మిక ఆరాధికులను ఆకట్టుకుంటాయి.



గడ్డిపూలతో ఆడుకుంటున్న చిన్నారి

కొత్త సోయగాలతో..



ఇటీవల వచ్చిన వరదల అనంతరం కొత్తగా ఏర్పడిన ఇసుక తిన్నెల అందాలను వీక్షించేందుకు చుట్టు పక్క ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారు. ప్రభుత్వ స్పందించి ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే మరింత మంది ఇక్కడికి వచ్చే అవకాశం ఏర్పడుతుంది.

మండవ బాలవర్ధిరావు, మాజీ సర్పంచ్

ప్రకృతి సిగలో.. ఆధ్యాత్మిక శోభ



శ్రీరామపాదక్షేత్రం ఘాట్ ప్రకృతి సోయగాలకు, ఆధ్యాత్మిక శోభకు ఆలవాలం. ఇక్కడ సూర్యాస్తమయ సమయంలో ఆకాశం కొత్తకొత్త అందాలను ఆవిష్కరిస్తుంది. ఇక్కడి ఆలయాలు భక్తులకు ఆధ్యాత్మిక భావనను పెంపొందిస్తాయి.

ఆలూరి శ్రీనివాసరావు, చైర్మన్, శ్రీరామపాదక్షేత్రం అభివృద్ధి కమిటీ

సెలవులు వచ్చాయంటే పర్యాటక కళ



సెలవులొస్తే చుట్టుపక్క ప్రాంతాల నుంచి వచ్చేవారితో పాటు ఈ ప్రాంతం గురించి పరిచయం ఉన్నవారితో శ్రీరామపాదక్షేత్రం ఘాట్ కళకళలాడుతుంది. వరదల అనంతరం నవలంక ఇసుక మేటలతో ఎత్తు పెరిగింది. ఈ ఇసుక తిన్నెలు చూసేందుకు, అందులో ఆడుకునేందుకు వచ్చే యువత ఎక్కువ.

నాగిడి పోతురాజు, స్థానిక మత్స్యకారుడు

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	125,134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.540

రీ సర్వే గ్రామసభలో 18 దరఖాస్తులు



కూచిపూడి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మొవ్వ మండలం అవిరిపూడిలో 933.81 ఎకరాల్లో గతంలో నిర్వహించిన రీ సర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కారానికి శనివారం నిర్వహించిన రీ సర్వే ప్రాజెక్టు గ్రామసభలో వివిధ సమస్యల పరిష్కారానికి 18 దరఖాస్తులు అందాయి. సర్పంచ్ ఏనుగు ఝాన్సీలక్ష్మీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ కె.మస్తాన్, రీ సర్వే డీటీ పి.జగన్మోహన్‌రావు, మండల సర్వేయర్ ఏ.కిషోర్, సచివాలయ సర్వేయర్ జి.రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి జగదీష్, వీఆర్వోలు ఏ.రవి, రెహమున్నీసా పాల్గొన్నారు.



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్

పారిశుధ్య పనుల పరిశీలన

గుడివాడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త తరలించే వాహనాలకు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు కోరారు. శనివారం పట్టణంలో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణను ఆయన పరిశీలించారు. పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి చెత్త సేకరణను పరిశీలించారు. వార్డుల్లో డ్రెయిన్ల క్లీనింగ్, పిచ్చిమొక్కలు, కాల్వ పోగుల తొలగింపును పరిశీలించారు. ప్రతిరోజు సాయంత్రం మూడు వార్డుల చొప్పున ఫాగింగ్ చేస్తున్నామని తెలిపారు. ఆయన వెంట అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న పోలీసులు

నివాసాల మధ్య మద్యం దుకాణం వద్దు

గుడివాడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నాగన్న చెరువు గట్టు పక్కన నూతనంగా ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాన్ని స్థానికులు అడ్డుకున్నారు. శనివారం నివాసాల మధ్య దుకాణాన్ని పెట్టడాన్ని నిరసిస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ నివాస గృహాల మధ్య మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల ఉన్న కుటుంబాలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. తమ ప్రాంతంలో మద్యం షాపును పెట్టనివ్వమని స్పష్టం చేశారు. ఆందోళనతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



నోట్‌బుక్స్ స్టేషనరీ పంపిణీ

పమిడిముక్కల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఐనపూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కూడేరుకు చెందిన దొడ్డ పూర్ణచంద్రరావు కుమారులు వెంకటేశ్వరరావు, సూర్యవెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో రూ. 15 వేల విలువచేసే నోట్‌బుక్స్, పెన్నులు, ఇతర సామాగ్రి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్‌వీకె స్వామి మాట్లాడుతూ పూర్ణచంద్రరావు ప్రతి సంవత్సరం విద్యార్థులకు ఉపయోగపడే వస్తువులు అందజేస్తున్నారని, వారికి అభినందనలు తెలుపుతున్నామన్నారు. ఉపాధ్యాయులు, గ్రామస్థులు శ్రీనివాసగుప్తా, సత్యనారాయణ పాల్గొన్నారు.



పరుగు పందేలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం శ్రీనివాసరావు, పీడీ బాలు

రాష్ట్రస్థాయి పరుగు పోటీలకు పెనమకూరు విద్యార్థుల ఎంపిక

తోట్లవల్లూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం జిల్లాలో త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పరుగు పోటీలకు పెనమకూరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు సమ్మంగి భానుప్రసాద్(9వ తరగతి), వల్లూరు అభిషేక్(8వ తరగతి) అర్హత సాధించారని ప్రధానోపాధ్యాయుడు బొప్పన శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 25న జగ్గయ్యపేటలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో భానుప్రసాద్, అభిషేక్ ప్రథమ, ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని హెచ్‌ఎం తెలిపారు. వీరిని శనివారం హైస్కూల్లో ప్రత్యేకంగా అభినందించి రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. పీఈటీ బాలుని హెచ్‌ఎం అభినందించారు.

నేడు విగ్రహాల పునః ప్రతిష్ఠ

తోట్లవల్లూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : వల్లూరుపాలెం అంబేడ్కర్ నగర్‌లో పునర్నిర్మించిన ఆలయంలో శ్రీగంగానమ్మ తల్లి, పోతురాజు స్వామి విగ్రహాల పునఃప్రతిష్ఠోత్సవం ఆదివారం జరుగనుందని ఆలయ నిర్మాణ కమిటీ శనివారం తెలిపింది.

మండల సమావేశం వాయిదా

పెదపారుపూడి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పెదపారుపూడి ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా హాజరై గ్రామాల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీటీసీ సభ్యులు కొంతమంది హాజరు కాకపోవటంతో అనివార్య కారణాల వల్ల సమావేశం వాయిదా పడిందని ఎంపీడీవో టి.సీతా మహాలక్ష్మి తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోగం సురేష్, తహసీల్దార్ రంగారావు, టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, సర్పంచ్ చప్పిడి సమీరా, కిషోర్, దగాని లెనిన్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా..!

- 90 శాతం పూర్తయిన స్కిల్ డెవలప్‌మెంట్ భవనం
- మిగిలిన పనులు పూర్తి చేయని వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వంలోనైనా పూర్తి చేయాలని కోరుతున్న నిరుద్యోగులు

పెదపారుపూడి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పెదపారుపూడి స్కిల్ డెవలప్‌మెంట్ భవన నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన 2018లో శంకుస్థాపన చేశారు. సుమారు రూ.65 లక్షలతో భవన నిర్మాణ పనులు చేపట్టారు. కానీ భవనం 90 శాతం పూర్తయింది. 10 శాతం పనులు మిగిలి ఉన్నాయి. అది కూడా పూర్తయి భవనం అందుబాటులోకి వస్తే యువతకు ఎంతగానో ఉపయోగపడుతుందని నిరుద్యోగ యువత అంటున్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ భవన నిర్మాణం విషయాన్ని పట్టించుకోలేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పట్టించుకుని ప్రారంభోత్సవం చేయాలని నిరుద్యోగ యువత కోరుతున్నారు.



పెదపారుపూడిలో నిరుపయోగంగా ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ భవనం

కార్యకర్తలకు అండగా పార్టీ సభ్యత్వం

ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా పార్టీ సభ్యత్వం ఉంటుందని, సంక్షేమం కోసం సంక్షేమ నిధిని ఏర్పాటు చేసిన ఏకైక పార్టీ టీడీపీనే అని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదులో కుమార్‌రాజా పాల్గొని నియోజకవర్గ పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీడీపీ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి బీమా పరిహారంగా రూ.5లక్షలు చెల్లించడం జరుగుతుందన్నారు. సభ్యత్వం పొందిన వారికి పార్టీ అన్ని విధాలా అండగా నిలిచి అవసరమైన సహాయ సహకారాలందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జక్కా శ్రీనివాసరావు, వీరంకి వెంకటగురుమూర్తి, దాలిపర్తి ప్రసాద్, గుత్తికొండ పద్మ, బీఎం లాజరస్, తెలుగురైతు ప్రధాన కార్యదర్శి వల్లూరిపల్లి గణేష్, టీడీపీ పట్టణ నేతలు పిసుబ్రహ్మణ్యం, మంతెన రామాంజనేయులు, తెలుగు యవత అధ్యక్షుడు కేదరాశిపల్లి శ్రీను, వీరంకి వెంకటేశ్వరరావు పానుగంటి సందీప్ పాల్గొన్నారు.



టీడీపీ కార్యకర్తల సభ్యత్వ నమోదులో పాల్గొన్న వర్ల కుమార్‌రాజా

బీసీల పక్షపాతి చంద్రబాబు

బీసీల అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు అనిఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. నాయీబ్రాహ్మణులకు దేవస్థానాల పాలక మండలిలో తప్పనిసరిగా స్థానం కల్పించడం పట్ల కృతజ్ఞతలు తెలియజేస్తూ శనివారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చేతుల మీదగా సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు బీసీల పక్షపాతిగా మరోసారి నిరూపించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయీబ్రాహ్మణ సంఘం నేతలు దాలిపర్తి ప్రసాద్, అనిల్, ఇతర బీసీ సంఘాల నేతలు నూకవరపు వీరాంజనేయులు, వీరంకి వెంకట గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలి

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పిలుపునిచ్చారు. స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్ ఆవరణలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పచ్చదనం పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పామర్రు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నవులూరి వీరవెంకయ్య, ఉపద్రష్టి రాంబాబు, డాక్టర్ బీవీ అప్పారావు, బైసాని నాగేశ్వరరావు, కూనపరెడ్డి చంద్రశేఖర్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రావి తదితరులు

ఎట్టకేలకు ముస్లిం శ్మశానవాటిక

అభివృద్ధి పనులు ప్రారంభం

- గతంలో నాని ఒత్తిడి మేరకు పనులు నిలుపుదల
- వైసీపీ కాంట్రాక్టర్‌కు రాలేదనే అక్కసుతో
- ఎమ్మెల్యే వెనిగండ్ల చొరవతో పనులు ప్రారంభం

(ఆంధ్రజ్యోతి - గుడివాడ)

కేవలం తమ పార్టీకి చెందిన కాంట్రాక్టర్‌కు పనులు దక్కలేదనే అక్కసుతో అభివృద్ధి పనులను నిలుపుదల చేసిన ఘనత మాజీ ఎమ్మెల్యే కొడాలి నానికే దక్కింది. మొదటి పర్యాయం టెండర్లలో వైసీపీ కాంట్రాక్టర్‌కు కాంట్రాక్టు దక్కకపోవడంతో నిర్దాక్షిణ్యంగా టెండర్‌ను రద్దు చేశారు. పలుమార్లు ముస్లిం పెద్దలు పనులను ప్రారంభించాలని నానిని కలిసేందుకు వెళితే ఛీత్కరింపులు తప్పలేదు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో టీడీపీ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రథమ ప్రాధాన్యతగా ముస్లిం శ్మశానవాటిక పనులను చేపడతానని యిచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. పనులు కార్యరూపం దాల్చాయి.

పట్టణంలోని బేతవోలులో 3.25 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ముస్లిం శ్మశానవాటికను పట్టణంలోని కార్మికనగర్, బేతవోలు, ఇందిరానగర్‌కాలనీ, వాంబు కాలనీ, ధనియాలపేట, నిమ్మతోట, రైలుపేట ప్రాంతాల్లో ఉండే ముస్లిం మైనార్టీలు వినియోగిస్తారు. పడమర వైపున గోడను నిర్మించేందుకు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి 2023 ఆగస్టులో రూ.34.70లక్షలు మంజూరయ్యాయి. మొదటిసారి టెండర్ పిలువగా జనసేన జిల్లా నాయకుడు, స్థానిక కాంట్రాక్టర్ పాలంకి సారధిబాబుకి కాంట్రాక్టు దక్కింది. తనకు కాంట్రాక్టు దక్కకపోవడంతో వైసీపీ కాంట్రాక్టర్ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని ద్వారా మున్సిపల్ అధికారులపై ఒత్తిడి తెచ్చి టెండర్‌ను రద్దు చేయించారు. మసీదు పెద్దలు పలుమార్లు కలిసి సమస్యను విన్నవించుకున్నా మాజీ ఎమ్మెల్యే నాని గానీ, షాడో మంత్రి శశి గానీ కరుణించలేదు. మాజీ కౌన్సిలర్ పసలాది ఏసుబాబు నాని వద్దకు వెళ్లి సమస్యను వివరించినా ఫలితం లేకుండా పోయింది. ఎన్నికల కోడ్ వస్తుందన్న క్రమంలో ముస్లిం పెద్దలను మభ్యపెట్టేందుకు డ్రామాలాడారు. రాత్రికి రాత్రి పనులను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. కానీ చేసింది శూన్యం.

ఎమ్మెల్యే వెనిగండ్ల చొరవతో..

ఎన్నికల సమయంలో యిచ్చిన మాట ప్రకారం ముస్లిం శ్మశానవాటిక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. టెండర్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి పనులను పట్టాలెక్కించారు. ఈ నెల 25న అభివృద్ధి పనులకు మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ముస్లిం సంప్రదాయ పద్ధతిలో భూమిపూజ నిర్వహించి ప్రారంభించారు. గోడ నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న జంగిల్‌ను శనివారం క్లియర్ చేశారు. పనులను ప్రారంభించడం పట్ల ముస్లిం పెద్దలు హర్షం వ్యక్తం చేశారు.

టీడీపీ కార్యకర్తలు గర్వంగా చెప్పుకొనేలా..

మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు

గుడివాడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యుడిగా ప్రతి ఒక్కరూ గర్వంగా చెప్పుకునే పరిస్థితులు నేడు రాష్ట్రంలో నెలకొన్నాయని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక ఏలూరురోడ్డులో ప్రజావేదికలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు రూ. లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 46వేల సభ్యత్వాలున్నాయని, నేడు జిల్లాలో సభ్యత్వ నమోదులో ప్రథమ స్థానంలో నిలిచేందుకు కృషి చేస్తామన్నారు. టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ సత్యసాయి రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, మాజీ కౌన్సిలర్ వసంతవాడ దుర్గారావు, నాయకులు మురళీ, దానేటి సన్యాసిరావు, సత్యనారాయణ, తులసీబాబు, భస్కారరావు, అరేకపూడి రామశాస్త్రులు, కొడాలి రామరాజు, జగన్మోహనరావు, సుధారాణి, శ్రీలక్ష్మీ, సుధాకర్, చింతయ్య, మజ్జాడ నాగరాజు, దారపురెడ్డి పాల్గొన్నారు.



శాశ్వత సభ్యత్వాన్ని తీసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే రావి

గుడివాడ-విజయవాడ

రహదారిని అభివృద్ధి చేయండి

గుడివాడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ-విజయవాడ రహదారిని త్వరితగతిన అభివృద్ధి చేయాలని, నాలుగు నియోజకవర్గాల మీదుగా ఈ రహదారి వెళుతుందని ఆయా ఎమ్మెల్యేలు నిధుల కోసం కృషి చేయాలని సీపీఎం నాయకుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక సుందరయ్యభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేలాది మంది ఈ రహదారిని వినియోగిస్తున్నారని, గోతులమయంగా మారడంతో ప్రయాణించడం ఇబ్బందికరంగా ఉందన్నారు. రహదారి అభివృద్ధిని కాంక్షిస్తూ ఈ నెల 28న చేపట్టిన పాదయాత్రను జయప్రదం చేయాలని ఆర్‌సీపీ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నీలం మురళీకృష్ణారెడ్డి, గంగాధ ఉమామహే శ్వరరావు, కోటేశ్వరరావు, సురేంద్ర, పి.రజిని, రేపాని కొండ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

గుడ్లవల్లేరు,అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గుడ్లవల్లేరు వీవీఐపీఎస్ ఫార్మాస్యూటికల్ కళాశాలలో ఐపీఏ స్టూడెంట్స్ ఫోరం శనివారం గుడ్లవల్లేరు శాఖ ప్రారంభించి నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్య అతిథిగా ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ (ఐపీఏ) రాష్ట్ర మాజీ అధ్యక్షుడు టి.వి.నారాయణ జ్యోతి వెలిగించి అసోసియేషన్‌ను ప్రారంభించారు. అనంతరం కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఇండియన్ జర్నల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఎడిటర్ డాక్టర్ ఎస్.వి ద్యాసాగర్, ఐపీఏ రాష్ట్ర శాఖ కార్యదర్శి ఎం.ప్రసాదరావు, కె.వెంకట రమణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, గుడ్లవల్లేరు శాఖ అధ్యక్షుడు పి.రవీష, వైస్ ప్రెసిడెంట్ కె.పరిమళ, సెక్రటరీ సాయిధాత్రి పాల్గొన్నారు.



నూతన కార్యవర్గంతో రాష్ట్ర శాఖ నాయకులు



క్రీడాదుస్తులు అందజేత

తాడంకి(పమిడిముక్కల), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారికి తోడ్పాటు అందించడం అభినందనీయమని ఉయ్యూరు డీవైఈవో ఐ.పద్మారాణి అన్నారు. తాడంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల పూర్వవిద్యార్థి అరిగె ప్రభాకరరావు కుమారుడు అరిగె అజయ్ ఆధ్వర్యంలో శనివారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఈవో మాట్లాడుతూ, క్రీడలను ప్రోత్సాహించాలన్న ఉద్దేశంతో విద్యార్థులకు క్రీడా దుస్తులు అందచేయడం అభినందనీయమన్నారు. వివిధ రకాల క్రీడల్లో తర్ఫీదు నిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు ఏపీ రాజు, పి.రవీంద్ర బాబును అభినందించారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సీహెచ్ రవికుమార్, తెలుగు ఉపాధ్యాయుడు భలే ఉమామహేశ్వరరావు, స్టాఫ్ సెక్రటరీ హుస్సేన్ పాల్గొన్నారు.

నేడు మొవ్వ మండల మహాసభ

కూచిపూడి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఎం మొవ్వ మండల 8వ మహాసభ ఆదివారం మండలంలోని వేములమడలో జరుగుతుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శీలం నారాయణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పార్టీ కార్యదర్శి బొల్లా సుబ్రహ్మణ్యేశ్వరరావు అధ్యక్షతన జరగనున్న ఈ మహాసభకు జిల్లా పార్టీ నాయకులు హాజరవుతారని తెలిపారు.

వడ్లమన్నాడులో గృహ సందర్శన

గుడ్లవల్లేరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం సమగ్ర శిక్షణ ద్వారా అనేక పథకాలు కల్పిస్తోందని కృష్ణా జిల్లా సమగ్ర శిక్షణ సహిత విద్యా కో-ఆర్డినేటర్ ఎస్.రాంబాబు అన్నారు. శనివారం వడ్లమన్నాడులో పలు గృహ సందర్శనలు చేసి తల్లిదండ్రులకు అవగాహన పరిచారు. ఏపీవో ఏడుకొండలు, ఐఈఆర్‌పీ అబ్దుల్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.540	

మధ్యాహ్న భోజనం బియ్యాన్ని తరలిస్తున్న నిర్వాహకురాలు!

పెడన, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన పథకం కింద తోటమూల జిల్లా పరిషత్ హైస్కూల్‌కు సరఫరా చేసిన బియ్యాన్ని నిర్వాహకురాలు దుర్గ ఇంటికి తీసుకెళ్తుండగా తొమ్మిదో వార్డు కౌన్సిలర్ గరికముక్కు చంద్రబాబు అడ్డుకున్నారు. దుర్గ హైస్కూల్ నుంచి బియ్యాన్ని ఆటోలో వేసుకుని ఇంటికి తరలించుకుపోతుండగా చంద్రబాబు అడ్డుకుని ప్రశ్నించారు. ఆమె పొంతన లేని సమాధానాలు చెప్పింది. హెచ్ఎం నాగేశ్వరరావును ప్రశ్నించగా, బియ్యం అపహరణ తన దృష్టికి రాలేదని, ఇకపై ఇటువంటివి జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటానని చెప్పారు. దుర్గ చివరకు తన తప్పును ఒప్పుకుంది. కౌన్సిలర్ చంద్రబాబు ఎంఈవో, డీఈవో, కలెక్టర్‌లకు ఫిర్యాదు చేశారు.

నాయీబ్రాహ్మణుల సమస్యలపై ఎమ్మెల్యే కాగితకు వినతిపత్రం

బంటుమిల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : బంటుమిల్లిలో ఇతర కులస్థులు బార్బర్ షాపులు పెట్టి నాయీబ్రాహ్మణకు అన్యాయం చేస్తున్నారంటూ శ్రీ వినాయక నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు అర్జీ ఇచ్చారు. అనాదిగా నాయీబ్రాహ్మణులు కులవృత్తే దైవంగా భావించి జీవిస్తున్నారన్నారు. కులవృత్తిని నాయీబ్రాహ్మణులే చేసుకునే విధం గా సహకరించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని, దేవాలయాల్లో పని చేస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశా రు. వారి సమస్యలపై ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సానుకూలంగా స్పందించారు. పొదిలి వెంకన్న, కొమ్మాలపాటి రవి, ముత్యాలపల్లి దుర్గారావు, మేడూరి సాయి , బి.సుబ్బారావు, కె.కోటి, మాటూరి శేషు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అవనిగడ్డ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గానికి చెందిన 17 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.6.48 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శనివారం అందజేశారు.

పశుగణన విజయవంతం చేయండి

అవనిగడ్డ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పశుగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శనివారం పశుగణన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పశుసంరక్షక శాఖ అధికారులతో కలసి ఆవిష్కరించారు. పశుసంవర్థకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.నంద కిషోర్, పశువైద్యాధికారులు ఎండి.షఫి, ప్రియాంక, సాయి మౌనిక, సుధారాణి, మమత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



డీఎస్పీ మురళీధర్‌ను సత్కరిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, సర్పంచ్, ఎంపీపీలు

కఠోర దీక్షతోనే ఉత్తమ ఫలితాలు

చల్లపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కఠోర దీక్షతోనే ఉత్తమ ఫలితాలు సాధించగల్గుతారని డీఎస్పీ మురళీధర్ అన్నారు. విజయ క్రాంతి కళాశాల ఫ్రెషర్స్ డే కరస్పాండెంట్ దుట్టా ఉమా మహేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. డీఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు లోనుకాకుండా తల్లిదండ్రులు, గురువుల పట్ల గౌరవంగా మెలుగుతూ సమాజంలో గుర్తింపు తెచ్చు కోవాలన్నారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీపీ కోట విజయరాధిక, చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు, ప్రిన్సిపాల్ దుట్టా శివరామప్రసాద్ ప్రసంగించారు. అతిథులను సత్కరించి జ్ఞాపికలు అందచేశారు.



రక్తదాన శిబిరానికి విశేష స్పందన

అవనిగడ్డ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా అవనిగడ్డ పోలీస్ స్టేషన్ వద్ద రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. డిఎస్పీ మురళీధర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ టి.ఎస్.ఎస్. బాలాజీ శిబిరాన్ని ప్రారంభించారు. ఎస్.వి.ఎల్.కళాశాల, అవనిగడ్డ డిగ్రీ కళాశాల విద్యార్థులతోపాటు దాదాపు 50 మంది రక్తదానం చేశారు. జిల్లా రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్ వంగర శేషగిరిరావు, జిల్లా కార్యదర్శి భవిరి శంకర్ నాథ్, సీఐ యువకుమార్, ఎస్ఐ శ్రీనివాస్, బీజేపీ నేత తుంగల వెంకటగిరి, జనసేన మండల అధ్యక్షులు గుడివాక శేషబాబు, బోగాది శివవిష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల పాఠశాల విద్యార్థులు

అవనిగడ్డ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో పులిగడ్డ గురుకుల విద్యాలయం విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎస్.టి.పి.కుమార్ తెలిపారు. అండర్-14 విభాగంలో పి.భువనేశ్వర్, ఎన్.అఖిల్, అండర్-17 సీనియర్ విభాగంలో బి.ఏలిషా, ఆర్.వరుణ్, టి.రాహుల్,, సిహెచ్. సాయి రామ్, వి.విజయకుమార్, కె.తేజిత్ ప్రతిభను చాటారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.



విద్యార్థులు విద్యుత్ సబ్‌స్టేషన్ సందర్శన

బంటుమిల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : బంటుమిల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. సబ్ స్టేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం.రవికుమార్ సబ్ స్టేషన్ నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరును విద్యార్థులకు వివరించారు. ప్రధానోపాధ్యాయు లు వి.వి. వెంకట్రావు, వ్యాయామోపాధ్యాయులు ఫణికృష్ణ, సర్వేశ్వరరావు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జ్యూయలరీ పార్కులో జాబ్‌మేళా

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జ్యూయలరీ పార్కులో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. ఇంటర్వ్యూకు 50 మంది హాజరు కాగా 13 మందిని ఎంపిక చేశారు. మచిలీపట్నం ఇమిటేషన్ జ్యూయలరీ పార్కు మెంబర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి అంకెం జితేంద్ర కుమార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి నరేష్‌కుమార్, ఒకేషనల్ ఉపాధి కల్పన అధికారి సత్యబ్రహ్మం, ప్రొఫెసర్ ఎస్. జయరాజు, దిలీప్ పాల్గొన్నారు.

రహదారులకు 1.8 కోట్లు మంజూరు

అవనిగడ్డ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఆర్ అండ్ బి రహదారుల మరమ్మతుల కోసం రూ.1.80 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. చల్లపల్లి - నడకుదురు రహదారికి రూ.15 లక్షలు, భావదేవరపల్లి - సంగమేశ్వరం రహదారికి రూ.10 లక్షలు, నాగాయలంక - నాలి రహదారికి రూ.30 లక్షలు, రామానగరం - నడకుదురు రహదారికి రూ.40 లక్షలు, ఆర్ అండ్ బి రహదారి మరమ్మతులకు రూ.30 లక్షలు, టి.కొత్తపాలెం - గుల్లలమోద రహదారికి రూ.30 లక్షలు మంజూరయ్యాయన్నారు.

ఆటోను దగ్ధం చేసిన గుర్తుతెలియని వ్యక్తి

చల్లపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నారాయణరావు నగర్‌లో గోవాడ నాగార్జుకు చెందిన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం తెల్లవారుజామున పెట్రోల్ పోసి దగ్ధం చేశారు. ఎవరో కావాలనే దగ్ధం చేశారని నాగార్జున తెలిపారు. ఎస్సై పిఎస్‌వి.సుబ్రహ్మణ్యం దర్యాప్తు చేస్తున్నారు.

వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

కోడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై చాణిక్య అన్నారు. కోడూరు ప్రధాన సెంటర్‌లో వాహనాలను తనిఖీ చేశారు. పత్రాలు లేని ఆటోలకు జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని, అతివేగంగా వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని, లౌడ్ స్పీకర్లు పెట్టవద్దని ఆయన తెలిపారు.

కానూరులో గోకులం నిర్మాణానికి శంకుస్థాపన



మచిలీపట్నం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గోకులాల నిర్మాణంతో పశువులను కాపాడుకుందామని తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. కానూరు గ్రామంలో గోకులం నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. చిటికినేటి అయ్యప్ప, బొలిశెట్టి నాని, గోపు వెంకటరమణ, బోట్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వేదాశీర్వచనానికి శ్రీకారం

మచిలీపట్నం టౌన్ : బచ్చుపేట వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వేదాశీర్వచనాన్ని ప్రారంభించి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. సంప్రదాయ సిద్ధంగా పుట్టిన రోజు పండుగ చేసుకుంటున్న మురాల దేవిష్‌కు 20 మంది వేదపండితులు వేదాశీర్వచనాలు అందించారు. ఆలయ ధర్మకర్త ముత్తేవి రవికాంత్, ఈవో సమ్మెట ఆంజనేయ స్వామి, ఆస్థాన విద్వాంసుడు ముత్తేవి శశికాంత్, భక్తుడు మురాల వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

ఘంటసాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : వెలుగు కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ బి.విజయప్రసాద్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని తెలిపారు. రైతులకు నాణ్యమైన, మెరుగైన సేవలను అందించటానికి కృషి చేయాలని తెలిపారు. మండల వ్యవసాయ శాఖ అధికారి కె.మురళీకృష్ణ, పీఏసీఎస్ సీఈవోలు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీకి పింగళి పేరు ముదావహం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం మెడికల్ కళాశాలకు జాతీయ పతాక నిర్మాత పింగళి వెంకయ్య పేరు పెట్టడం ముదావహమని రాధా రంగా మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు బుల్లెట్ ధర్మారావు అన్నారు. పింగళి వెంకయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూరిశెట్టి హరికృష్ణ, షేక్ సిరాజుద్దీన్, బడుగు ఉమాదేవి, వేముల కుమారి, కాట్రగడ్డ నాగేశ్వరరావు, లంకిశెట్టి నీరజ తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుంచి సభ్యత్వ నమోదుకు తరలివెళుతున్న టీడీపీ శ్రేణులు, సభ్యత్వం తీసుకుంటున్న కాగిత

ఉద్యమంగా టీడీపీ సభ్యత్వ నమోదు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును ఉద్యమంగా శనివారం చేపట్టారు. బస్టాండ్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ డివిజన్లు, గ్రామాల్లో సభ్యత్వ నమోదుకు టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు. టీడీపీ సీనియర్ నాయకుడు గోపీచంద్, గోపు సత్యనారాయణ, ఎండి ఇలియాస్ పాషా, పిప్పళ్ళ కాంతారావు, ఐపిసి కరుణకుమార్, మరకాని సమతాకీర్తి, పల్లపాటి సుబ్రహ్మణ్యం, కుంచే నాని పాల్గొన్నారు

పెడనలో ఎమ్మెల్యే కాగిత ప్రారంభం

పెడన : తొలి సభ్యత్వం తీసుకుని కృష్ణప్రసాద్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు రూ. 5 లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తామన్నారు. బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, ప్రసాద్, నగేష్, యక్కల శ్యామలయ్య, అబ్దుల్ ఖయూం, శీరం ప్రసాద్, హమీదుల్లా, వీరబాబు, మురాల ఫణికుమార్, పరసా సూర్యనారాయణ, బెజవాడ నాగరాజు పాల్గొన్నారు.

చల్లపల్లిలో ఉచిత మెగా వైద్యశిబిరం నేడు

చల్లపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఆదివారం చల్లపల్లి పడమరవీధిలోని శ్రీరామలింగ చౌడేశ్వరి అమ్మవారి కల్యాణ మండపంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీవిఘ్నేశ్వర వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ మేనేజర్ బళ్లా జయప్రకాష్ తెలిపారు. అప్తమాలజీ, గైనకాలజిస్ట్, కార్డియాలజిస్ట్, ఆర్థోపెడిక్ల వైద్యనిపుణులు శిబిరానికి వచ్చి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.